RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 20 సెప్టెంబర్ 2025 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:94

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లంచగొండులపై కఠినచర్యలు

**ఇండ్లు ఇవ్వకుండానే చెల్లింపులు చేసిన నలుగురు అధికారులు సస్పెన్షన్**
**10 వేలు డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు తొలగింపు**
**30 వేలు డిమాండ్ అంశంపై తక్షణ నివేదికకు ఆదేశం**
**లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేయండి**
**డబ్బుల కోసం పేదలను వేధిస్తే 24 గంటల్లో క్రిమినల్ కేసుల నమోదు**
**ఇండ్ల కోసం ఇచ్చిన నిధులను పాతబాకీకి జమ చేసే బ్యాంకులపై చర్యలు**
**కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ :- పేదవాడి సొంతింటి కలను నెరవర్చే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల సమస్యలు, సందేహాలకోసం గత వారం హౌసింగ్ కార్పోరేషన్‌లో ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ( సిజిజి) ఎడిజీ సంగ్రామ్ సింగ్ పాటిల్ తోకలిసి మంత్రిగారు సుదీర్ఘంగా సమీక్షించారు. ఏ ఏ అంశాలపై కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులను అడిగి తెలుసుకొని తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్దిదారుల నుంచి లంచం అడిగే ఇందిరమ్మ కమిటీ సభ్యులను తక్షణం కమిటీ నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి సూర్యాపేట జిల్లా మధిరాల మండలం పోలుమల్ల గ్రామంలో కొండ లింగయ్య అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం పదివేల డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సత్తెయ్యను, జనగాం జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాలో శివమ్మ అనే లబ్దిదారురాలి నుంచి 30 వేల రూపాయిలు ఇవ్వాలని గ్రామ పంచాయితీ సెక్రటరీ డిమాండ్ చేశారని ఫిర్యాదురాగా విచారణలో ఇందిరమ్మ కమిటీ సభ్యుని పాత్ర ఉందని తేలింది. దీంతో ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24గంటల్లో నివేదిక ఇవ్వాలని మంత్రిఆదేశించారు. కాల్‌సెంటర్ కు వచ్చిన ఫిర్యాదులపై మంత్రిగారు పై విధంగా స్పందించారు.

అదేవిధంగా ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇండ్లు మంజూరుకాని నలుగురికి వారి ఖాతాలో నిధులు జమచేసిన గ్రామ పంచాయితీ సెక్రటరీలను తక్షణమే సస్పెండ్ చేసి ఈసంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నామని, అయితే కొన్ని బ్యాంకులు ఈ నిధులను లబ్దిదారుల ఖాతాలో జమచేసి పాత బకాయి కింద జమ చేసుకుంటున్నాయని, ఇటువంటి చర్యలను సహించేదిలేదని, సదరు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి లేఖ రాయాలని హౌసింగ్ ఎండీని ఆదేశించారు.

ఆధార్ నెంబర్ ఆధారంగా చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను ఈనెల 25వ తేదీలోగా పరిష్కరించి దసరా పండగలోపు చెల్లింపులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ లు కూడా ప్రతిగ్రామంలో లబ్దిదారుని వద్దకు వెళ్లి ఆధార్, బ్యాంకు వివరాలను పరిశీలించాలని లబ్దిదారుడు కూడా బ్యాంకుకు వెళ్లి ఆధార్‌నెంబర్‌తో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోవాలని సూచించారు.ఆధార్ నెంబర్ గాని, పేరుగాని తప్పు ఉంటే గ్రామ కార్యదర్శి ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి సరిచేసుకోవాలన్నారు. త్వరలో లబ్దిదారుడే స్వయంగా ఈ దిద్దుబాటు చేసుకొనేలా యాప్‌ను తయారుచేశామని, ఒకటి రెండు రోజుల్లో ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. సాంకేతికపరంగా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పేదలను ఇబ్బందిపెట్టి డబ్బుల వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటామని కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును తక్షణం ఆయా జిల్లా కలెక్టర్ , ఎస్పీకి పంపడంతోపాటు సచివాలయంలోని తన కార్యాలయానికి కూడా పంపించాలని అధికారులకు సూచించారు. ఇటువంటి ఫిర్యాదులపై తమ కార్యాలయం కూడా మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేసి వివరాలను తెలియజేస్తే 24 గంటల్లో యాక్షన్ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో చేతన్ కృష్ణస్వామి, వైస్ ప్రెసిడెంట్, public policy, అమోజాన్ ఇండియా

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ భేటీ



ఢిల్లీ: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ పిలిప్ డి.మర్ఫీ ఢిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. విద్యా, గ్రీన్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్ (సినిమా రంగం), మౌలిక వసతులు (మెట్రో... పట్టణ రవాణా), మూసీ రివర్ ఫ్రంట్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి... న్యూజెర్సీ గవర్నర్ చర్చించారు. తెలంగాణ విజన్ ఏ2047 సాధనలో తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి వివరించారు. ఐటీ, ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యాన్ని సీఎం తెలియజేశారు. భేటీలో గవర్నర్ సతీమణితో పాటు న్యూజెర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో పనులు రేషనలైజేషన్ చేయండి

### ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** అభివృద్ధి పనులను శాఖల వారీగా ప్రాధాన్యత క్రమంలో రేషనలైజేషన్ చేసుకొని రావాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

1:3 శాతం చొప్పున ప్రతిపాదనలు తీసుకురావాలని, ప్రతిపాదనల సంఖ్య ఎక్కువగా ఉంటే సంవత్సరాల వారిగా ప్రాధాన్యత క్రమంలో విభజన చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సూచించిన మేరకు అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. Ham రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సబ్ కమిటీ సభ్యులు ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలో వచ్చిన ప్రతిపాదనలను సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు వివిధ శాఖల కార్యదర్శులు పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరికను నిర్మూలిస్తాం



మిగతా 2లో

ప్రజాబలం

20 సెప్టెంబర్ 2025 శనివారం

# దారితప్పుతున్న ఆత్మగౌరవ ఉద్యమం

భారతదేశంలో మొట్టమొదట విప్లవాత్మక సంస్కరణలకు బీజంవేసిన వ్యక్తి పెరియార్ ఇవి రామస్వామి. ఆయన గొప్ప రాజకీయవేత్త, ఆత్మగౌరవ ఉద్యమం వ్యవస్థాపకులు. ఈ ఏడాదికి పెరియార్ ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమానికి వందేళ్లవుతుంది. ఆ విప్లవ నాయకుని గురించి మాట్లాడుకోవాలంటే ఆధిపత్యం, అణచివేత, ఛాందస భావాలపై ఆత్మగౌరవ రణభేరి గురించే. ఈ ఉద్యమం తమిళనాడు ప్రజల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవనంలో పెను మార్పులకు సృష్టించింది. దక్షిణ భారతదేశంలో ద్రావిడ ఉద్యమానికి ఆజ్యం పోసింది. వెనుకబడిన వర్గాలలో చైతన్యాన్ని రగిలించింది. ఈ సందర్భంగా వందేళ్ళ ఆత్మగౌరవ ఉద్యమ ప్రస్థానాన్ని సింహావలోకనం చేసుకోవాల్సిన సమయమిది. తమిళనాడులో 1925లో ఇవి రామస్వామి ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కులవ్యవస్థ, బ్రాహ్మణ ఆధిపత్యం, సామాజిక అసమానతలపై సవాల్ విసిరారు. అనేక రూపాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను అంతమొందించడానికి కృషిచేశారు. పూజారులు లేకుండా ఆత్మగౌరవ వివాహాలు జరుపుతూ చట్టపరమైన గుర్తింపు ఇచ్చారు. భారతదేశంలో మొదటిసారిగా చట్టబద్ధంగా గుర్తించబడిన వివాహాలు ఇవే. అట్టడుగు వర్గాలకు కులాల మధ్య సమానత్వం, గౌరవాన్ని ప్రోత్సహించారు. హేతుబద్ధమైన ఆలోచనను ప్రోత్సహిస్తూ, గుడ్డి ఆచారాలను వ్యతిరేకిస్తూ శాస్త్రీయ దృక్పథానికి పెద్దపీట వేశారు. ఆయన సంస్కరణవాద, తార్కిక ఆలోచనలను వ్యాప్తి చేయడానికి 'కుడి అరసు' అనే తమిళ వారపత్రికను ప్రచురించారు. పెరియార్ సమానత్వాన్ని ప్రబోధించి, సామాజిక అసమానతలపై పోరాడిన జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో గాఢంగా ప్రభావితమయ్యాడు. 1919 నుండి 1925 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. తదనంతర కాలంలో కాంగ్రెస్ పెద్దలతో విభేదించి దేశ స్వాతంత్ర్యం కన్నా సాంఘిక సమానత్వమే ముఖ్యమని పోరాడారు. కేరళలో 1924–, 25లో అంటరానితనానికి వ్యతిరేకంగా, ఆలయ ప్రవేశ హక్కుల కోసం జరిగిన వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆయన సామాజిక విప్లవపోరాటం తమిళనాడులో పెనుమార్పులను తీసుకువచ్చింది. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు, విద్య మద్దతు వంటి ప్రగతిశీల సామాజిక విధానాలను పునాదిపడ్డది. ఇప్పటికీ తమిళనాడు ఉద్యమాలు, ప్రభుత్వ విధానాలు దేశరాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఆయన ఆత్మగౌరవ ఉద్యమ ప్రభావంతో లౌకిక, సమానత్వ భావాలు భారత రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. ప్రశ్నించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవడం లాంటి అంశాలను ప్రాథమిక విధులలో అధికరణ 51ఎ(హెచ్)లో పొందుపరిచారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 42% బిసి రిజర్వేషన్లను తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ జరుగుతున్నది. పెరియార్ ఆత్మగౌరవ నినాదంతో ద్రావిడ కజగం అనే రాజకీయ సంస్థను ఏర్పాటు చేశాడు. దీన్నుంచే తమిళనాట రాజకీయ పార్టీలైన డిఎంకె, ఎఐఎడిఎంకె వంటివి పుట్టాయి. నేటికీ ఇవే అక్కడి రాజకీయాలను శాసిస్తూ ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్నాయి. పెరియార్ ఆత్మగౌరవ పునాదుల మీదనే దేశంలో అట్టడుగు వర్గాలనుంచి పలు రాజకీయ పార్టీలు, ఉద్యమ సంస్థలు వచ్చాయి.

ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఆవిర్భవించిన పార్టీలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. దేశంలో కులచైతన్యం, కులగణన, రాజకీయ డిమాండ్లు, రిజర్వేషన్స్ పెంపుపై చర్చ జరుగుతుంది. మరోవైపు కులాధిపత్య రాజకీయాల్లో వెనకబడిన వర్గాలు, మహిళల అవకాశాలకు దూరమవుతున్నారు. ఛాందస భావాలు, గుడ్డి నమ్మకాలు ప్రబలుతున్నాయి. ప్రశ్నించే వారిపై దాడి జరుగుతుంది. కుల, మతపరమైన అస్తిత్వ రాజకీయాలు మళ్లీ తలెత్తిన సందర్భంలో పెరియార్ ఉద్యమం ప్రబోధించిన భావాలు తిరిగి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సెయింట్ ఆంటోనీ కళాశాలలో 'ఆత్మగౌరవ ఉద్యమం, దాని వారసత్వం' పై సదస్సు జరిగింది. పెరియార్ ఇవి రామస్వామి స్థాపించిన ఆత్మగౌరవ ఉద్యమం వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించారు. భారతదేశంలో ఇలాంటి ఆత్మాభిమాన ఉద్యమం గురించి చర్చ జరగకపోవడం గమనార్హం. నేటికీ మెజారిటీ బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు అగ్రకుల రాజకీయ పార్టీల నీడలోనే బ్రతుకుతున్నారు. తమ విముక్తికి సంబంధం లేని పరధర్మంలో జీవిస్తున్నారు. ఇదెలా ఆత్మగౌరవమవుతుంది?. మనువాద భావజాలంపై ప్రతిఘటనే పెరియార్ ఉద్యమం . ఇదీ నిచ్చినమెట్ల కులవ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం, మహిళల అణిచివేత వంటి వాటిపై ధిక్కార స్వరమే. ఇప్పటికీ వీటి ఛాయలు సమాజంలో పరోక్షంగా కొనసాగుతున్నాయి. వీటి నుంచి విముక్తి పొందాలంటే నేడు స్వధర్మాన్ని తెలుసుకొని రాజ్యాంగ ఆయుధాలతో స్వరాజ్యాన్ని నిర్మించుకోవాలి. అప్పుడే మెజారిటీ వర్గాలైన బిసి, ఎస్‌సి, ఎస్‌టిల సామాజిక ఆర్థిక, రాజకీయ సాధికారత సాధ్యమవుతుంది. పెరియార్ స్పష్టంగా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించి అట్టడుగు వర్గాల విముక్తికి కృషి చేశాడు. సామాజిక, సాంస్కృతిక, వైజ్ఞానిక చైతన్యంతో రాజ్యాధికారం కోసం పోరాటం చేశాడు. బహుజన రాజ్యాధికారాన్ని రుచి చూపించిన కాన్షీరాం సైతం పెరియార్‌ను ఉత్తర భారతదేశంలో పరిచయం చేసి ఆత్మగౌరవాన్ని ప్రబోధించాడు. ఇది పెరియార్ అనుచరులు అర్థం చేసుకోకపోవడం బాధాకరం. కావున ఇప్పటికైనా ఆ చీకటి పొరల నుంచి విద్యావంతులు బయటకు రావాలి. అప్పుడే పెరియార్ వందేళ్ళ ఆత్మగౌరవ

# తెలంగాణ మైనారిటీలకు సీఎం రేవంత్ రెడ్డి గొప్ప కానుక

## రెండు కొత్త పథకాలను ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్, తెలంగాణ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేసింది. శుక్రవారం సచివాలయంలో రెండు కొత్త పథకాలను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు లాంచనంగా ప్రారంభించారు.

"ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన", "రేవంతన్నా కా సహారా మిస్కీన్‌ల కోసం" పేరుతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రక్రియ కు సంబంధించిన పోర్టల్ ను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ రెండు పథకాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ...

"ఈ రెండు పథకాలు మైనారిటీల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాయి. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయి" అని వెల్లడించారు.

"వితంతువులు, విడాకులు పొందినవారు, అనాధలు, అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టి స్వయం ఉపాధి పొందేలా ఇందిరమ్మ యోజన తోడ్పడుతుంది" అని తెలిపారు. "ఫకీర్, దుదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాలు ఇవ్వడం వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తుంది" అని అన్నారు.

"సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చి వెంటనే అమలు చేసే నాయకుడు. ఆయన దూరదృష్టి వల్లే ఈ పథకాలు వెలువడ్డాయి" అని పేర్కొన్నారు.

. "ఈ రెండు పథకాలకే ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించడం మైనారిటీల పట్ల అంకితభావానికి నిదర్శనం" అని తేల్చారు.

"నేను మంత్రి గా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు పూర్తి అయిన కొద్ది రోజుల్లోనే ఇలాంటి కొత్త పథకాలు ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నానని" చెప్పారు.

"లబ్ధిదారులు ఈ సాయాన్ని కుటుంబాభివృద్ధికి వినియోగించుకోవాలనీ సూచించారు.

"మైనారిటీల అభివృద్ధి అంటే కేవలం సబ్సిడీలు కాదు, వారిని స్వయం ఉపాధికి దారి చూపడం మా లక్ష్యం" అని స్పష్టం చేశారు.

"ఈ పథకాలు కుటుంబ పోషణకు తోడ్పడటమే కాకుండా, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచుతాయి" అని అన్నారు.

"చిన్న వ్యాపారాల ద్వారా సంపాదన పెరిగితే, వారిలోని యువతకు చదువులోనూ, ఉపాధిలోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయి" అని చెప్పారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల కలలు సాకారం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఎవరూ వెనుకబడకుండా అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడమే మా సంకల్పం" అని వెల్లడించారు.

"ఈ పథకాలు తాత్కాలిక సహాయం మాత్రమే కాదు, మైనారిటీల దీర్ఘకాలిక స్థిరమైన అభివృద్ధికి పునాది" అని అన్నారు.

"సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న పథకాలను అమలు చేస్తాం" అని హామీ ఇచ్చారు.

లాంచ్ చేసిన పథకాలు ?

1.ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ? వితంతువులు, విడాకులు పొందినవారు, అనాధలు, అవివాహిత మహిళలకు ?50,000 సాయం.

2.రేవంతన్నా కా సహారా మిస్కీన్‌ల కోసం ? ఫఖీర్, దుదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాలు, ఒక్కొక్కరికి ?1.00 లక్ష గ్రాంట్.

రిజిస్ట్రేషన్ల వివరాలు ?

ప్రారంభం : 19-09-2025

చివరి తేదీ : 06-10-2025

ఆన్‌లైన్ : TGOBMMS వెబ్‌పోర్టల్ (%tgobmms.cgg.gov.in)

ఆఫ్‌లైన్ దరఖాస్తులు పరిగణలోకి తీసుకోరు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, గ్రంథాలయాల చైర్మన్ డా. రియాజ్, కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మనలా మోహన్ రెడ్డి, TGMFC MdÓ & ఎం.డి కాంతి వెస్లీ IAS, షఫియుల్లా IFS, AGM కె. పెర్సిస్, రీజినల్ అధికారి ప్రవీణ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# సనత్‌నగర్ టిమ్స్ పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**సనత్‌నగర్ టిమ్స్ పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

హాస్పిటల్ ప్రారంభించిన రోజు నుండే ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా అవసరమైన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ అన్నీ ముందే సమకూర్చుకోవాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు.

డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించుకోవాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

ఈ మేరకు సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట్ టిమ్స్ హాస్పిటళ్లు, నిమ్స్ హాస్పిటల్ విస్తరణ ప్రాజెక్ట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

సనత్‌నగర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ల పనులు మరో 6 నెలల్లో పూర్తి అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి గుర్తు చేశారు.

అక్టోబర్ చివరి నాటికల్లా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కావొద్దన్నారు.

ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్ అన్నీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడినవే కొనుగోలు చేయాలని సూచించారు.

సంబంధిత డిపార్ట్‌మెంట్ డాక్టర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా తీశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌కు హాస్టల్ సదుపాయం కూడా అక్కడే ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

మహబూబాబాద్, మంచిర్యాల్, జనగాం, వనపర్తి మెడికల్ కాలేజీ భవనాలను మరో 2 నెలల్లో అప్పగిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు.

మరో 8 నెలల్లో మిగిలిన కాలేజీల పనులను పూర్తి చేస్తామని తెలిపారు.



వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను మంత్రి ఆదేశించారు.

సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, ఆర్‌అండ్‌బీ సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, ఇతర అధికారులు, ఆయా భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరికను నిర్మూలిస్తాం

## మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే పేదరికం అంతం అవుతుంది

## హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజార్ సలహాలోనే హైదరాబాదులో మరిన్ని స్థలాలను మహిళా సంఘాలకు కేటాయిస్తాం

## సారస్ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క

హైదరాబాద్ ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తాం, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే పేదరికం అంతం అవుతుంది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

హైటెక్ సిటీలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో సరస్ మేళాను పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రాంగణాన్ని ఆరంభించిన మంత్రి సీతక్క వెంట స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బాలల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభ, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, అదనపు సీఈవో కాత్యాయిని, స్త్రీనిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి, %ఔజు-ఎబఎ% సీఈవో సీతా పల్లచోళ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ కళాకారులు ఘన స్వాగతం పలకగా, డప్పుల చప్పుళ్లతో మారుమోగిన ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంలో తెలంగాణ చరిత్ర, పోరాటాలకు చెందిన కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి సీతక్క స్వయంగా స్టాల్స్‌ను సందర్శించి మహిళలతో మాట్లాడి ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

సరస్ మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ మంత్రి సీతక్క హైటెక్ సిటీ వంటి విలువైన ప్రదేశాన్ని గ్రామీణ మహిళల చేతివృత్తులు, ఉత్పత్తుల ప్రదర్శన కోసం కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించడం తమ సంకల్పమని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు రూ. 27 వేల కోట్ల రుణాలను సమకూర్చినట్లు వెల్లడించారు.మహిళలు బ్యాంకుల నుంచి తాము తీసుకున్న రుణాలను 98 శాతం రీపేమెంట్ చేస్తున్నారని, అందువల్ల బ్యాంకులు మరింత ఉత్సాహంగా సహకరిస్తున్నాయని మంత్రి తెలిపారు. చిరు వ్యాపారాలతో ప్రారంభమైన మహిళా శక్తి ఇప్పుడు పెద్ద వ్యాపారాల్లో అడుగుపెడుతోందని, నారాయణపేటలో మహిళా సమాఖ్య విజయవంతంగా పెట్రోల్ బంకును నడుపుతోందని, ఆరు నెలల్లో రూ. 15.50 లక్షల ఆదాయం సంపాదించిందని పేర్కొన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టులు, పలు వ్యాపారాలను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని, మహిళలు సంతోషంగా ఉంటే కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందని అన్నారు.

మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు ఆకాశాన్ని చీల్చి అంతరిక్షంలోకి వెళ్ళగలరని నిరూపించారని గుర్తుచేసిన మంత్రి, మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. బ్యాంక్స్ రుణాల ద్వారా వడ్డీ వ్యాపారుల దోపిడీని అడ్డుకున్నామని, మహిళా సంఘాలు క్రమశిక్షణ, నమ్మకానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యమని, హైటెక్ సిటీ ప్రాంగణంలో విజయవంతమైన ఈ ప్రయత్నం తరహాలోనే హైదరాబాద్‌లో మరికొన్ని ప్రదేశాలను కూడా మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు కేటాయిస్తామని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలని పిలుపునిచ్చిన మంత్రి సీతక్క, ఈ సందర్భంగా మహిళా సంఘాలకు లోన్లు సులభంగా అందజేస్తున్న పలువురు బ్యాంకర్లను సన్మానించారు.

# ముస్లిం పంచాయతీలు నేతృత్వంలోని ప్రాధాన్యత సూచిస్తున్నాయి. మహిళల పారిశుధ్యం టుంబాలకు ముఖ్యంగా ఇస్తున్నాయని

## నేతృత్వంలోని మహిళల ప్రత్యేక అధ్యయనాలు

బీహార్ లో మరో ఆసక్తికరమైన కేసు ఉంది. పంచాయతీ ప్రతినిధులలో మహిళలు నామినేషన్లలో తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ మరియు ప్రచారంలో వారు సహేళను ఎదురటీవలిన ఎన్నికలు ముస్లిం మహిళలు ఎన్నికల విజయం కోసం నెట్వర్క్లు మరియు స్వయం సహాయక బృందాలను ఉపయోగించుకుంటున్నారని చూపించాయి. రాష్ట్రంలో ఇప్పటికే మహిళా ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండటం ముస్లిం మహిళల లాభాలను ప్రత్యేకంగా చూపిస్తుంది. అస్సాంలో, ముఖ్యంగా దిగువ మరియు దక్షిణ జిల్లాల్లో, చాలా మంది ముస్లిం మహిళలు పార్టీ చిహ్నాలు లేకుండా పంచాయతీ ఎన్నికలలో పోటీ చేశారు, గుర్తింపు మరియు మద్దతు కోసం కుటుంబ నెట్వర్క్లపై ఆధారపడ్డారు.

పరిమిత ప్రజా స్పందన ఉన్న గృహిణులు ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నందున ఇది ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. "చార్" ప్రాంతాలలో, చాలా మంది మొదటిసారి మహిళా అభ్యర్థులు పోటీ చేసి గెలిచారు, వారి విజయాన్ని ముస్లిం మహిళా ఓటర్ల మద్దతుకు ఘనత ఇచ్చారు. ప్రపంచంలోని అతిపెద్ద మహిళా సమిష్టిలలో ఒకటైన కేరళ కుటుంబంశ్రీ కూడా రాజకీయ భాగస్వామ్యానికి ఒక వేదికగా మారింది. 2020 స్థానిక ఎన్నికలలో, 16, 965 మంది సభ్యులు పోటీ చేశారు మరియు 7,071 మంది గెలిచారు: స్థానిక ప్రతినిధులలో దాదాపు మూడింట ఒక వంతు మంది కుటుంబంశ్రీ సభ్యులు. ముస్లింలు అధికంగా ఉండే మలప్పురంలో, ముస్లింలు జనాభాలో 70% ఉన్నారు, స్థానిక సంస్థలు, వార్డు కార్యాలయాలు మరియు పొరుగు సమూహాలలో మహిళా ప్రాతినిధ్యం ఒక ప్రమాణంగా మారింది- ఇది సంప్రదాయవాద గృహాల నుండి మొదటి తరం ప్రవేశకులకు ఒక వేదికను అందిస్తుంది.

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద, ఎన్నికైన మహిళా ప్రతినిధులకు నాయకత్వం మరియు నేపథ్య మాడ్యూళ్ళకు కేంద్రం నిధులు సమకూరుస్తుంది. మార్చి 8, 2025న, "మహిళలకు అనుకూలమైన గ్రామ పంచాయతీలను" ప్రోత్సహించడానికి ప్రత్యేక గ్రామ సభలు జరిగాయి. %ఖచీఖీూూ% భాగస్వామ్యంతో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ శిక్షణ కంటెంట్ మరియు మాస్టర్ ట్రైనర్లను ట్రైన అభివృద్ధి చేసింది. మహిళలు సమిష్టి డిమాండ్లను వ్యక్తీకరించడానికి వీలుగా మహిళా సభలు- మహిళలకు మాత్రమే సమావేశాలను సంస్థాగతీకరించడానికి ప్రభుత్వం రాష్ట్రాలకు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ముస్లిం మహిళలు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, సాధికారత పొందడానికి మరియు వారి భవిష్యత్తుకు క్యూరేటర్లుగా ఎదగడానికి ఇటువంటి వేదికలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

స్థానిక సంస్థలలోకి ముస్లిం మహిళల ప్రవేశం భారతదేశ అట్టడుగు రాజకీయాలలో ఒక గణనీయమైన మార్పు అని, ప్రతీకాత్మక వసతి కాదని ఈ ఆధారాలు చూపిస్తున్నాయి. రిజర్వేషన్లు, పార్టీ ప్రచారం మరియు పంచాయతీ రాజ్ కింద కొత్త వేదికల ద్వారా ప్రారంభించబడిన ఈ మహిళలు భాగస్వామ్యాన్ని స్పష్టమైన ప్రజా ప్రయోజనాలుగా మారుస్తున్నారు. ఈ సంస్థాగత మద్దతు కొనసాగితే, మహిళలకు సాధికారత కల్పిస్తుంది, స్థానిక ప్రకృతి దృశ్యాన్ని మారుస్తుంది మరియు భారతదేశ అట్టడుగు ప్రజాస్వామ్యాన్ని ప్రపంచ ఉదాహరణగా ధైర్యపరుస్తుంది.

# బతుకమ్మ -తెలంగాణ సాంస్కృతిక ఆత్మ

తెలంగాణ భూమి సాంస్కృతిక సంపదలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉంది. "బతుకు ం అమ్మ" అనే పదాల కలయికతో వచ్చిన బతుకమ్మ అన్న పదానికి "జీవించు తల్లి" అనే అర్థం వస్తుంది. ప్రకృతిని పూజించే సంప్రదాయానికి ప్రతీకగా, పూలను దేవతగా భావించే ఆచారంగా బతుకమ్మ పండుగ నిలిచింది.

పండుగ కాలం

బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం అశ్వయుజ మాస శుద్ధ పాద్యమి నుండి మహానవర వరకు తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. చివరి రోజు "సద్దుల బతుకమ్మ"గా నిర్వహిస్తారు. ఈ తొమ్మిది రోజులు మహిళల ఆనందోత్సాహాలతో, గ్రామీణ వాతావరణం సాంప్రదాయ గీతాలతో మారుమ్రోగుతుంది.

పూల పూజ

ప్రపంచమంతటా పూలను దేవతలకు అర్పిస్తారు. కానీ తెలంగాణలో మాత్రం పూలనే దేవతలుగా పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. గున్నెపువ్వు, బంతిపువ్వు, చామంతి, కాసిపువ్వు, తంగెడు, గుమ్మడిపువ్వు వంటి పూలతో బతుకమ్మను కొండ ఆకారంలో అమర్చుతారు. పూల సమాహారంలో మధ్యలో గౌరీ దేవి ప్రతీకను ఉంచుతారు. ఇది సృష్టి శక్తి, స్త్రీ శక్తికి ప్రతీక.

సామాజిక సమైక్యత

బతుకమ్మ పండుగ మహిళలకు మాత్రమే పరిమితం అయినా, సమాజమంతటికీ ఉత్సవ వాతావరణాన్ని కలిగిస్తుంది. సాయంత్రం సమయాల్లో మహిళలు ఇంటింటి నుంచి చేరి వలయాకారంలో నిలబడి పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడతారు. ఈ పాటల్లో ప్రకృతి సౌందర్యం, గ్రామీణ జీవన విధానం, పంటలపై ఆనందం, దేవతల జ్ఞాపకాలు ప్రతిబింబిస్తాయి. పాటల ద్వారా తరతరాలుగా జ్ఞానం, సంస్కృతి సంక్రమించబడుతుంది.

సద్దుల బతుకమ్మ

చివరి రోజు సద్దుల బతుకమ్మను చెరువుల్లో, నదుల్లో నిమజ్జనం చేస్తారు. ఆ రోజు పిండివంటలు, సద్దులు తయారు చేసి పంచుకుంటారు. ఇది పంచుకోవడం, సహజీవనాన్ని ప్రతిబింబించే ఆచారం. చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులకు గౌరవం చూపిస్తారు.

తెలంగాణ గుర్తింపు

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించింది. హైదరాబాదులో ట్యాంక్‌బండ్ వంటి ప్రదేశాల్లో భారీ స్థాయిలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా ఈ పండుగకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. తెలంగాణ వలసవాసులు అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో కూడా బతుకమ్మను ఘనంగా జరుపుతున్నారు.

బతుకమ్మ గీతాలు

బతుకమ్మ పాటలు తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, స్థానిక సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. స్వాతంత్ర్యానంతరం, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత, బతుకమ్మపై కొత్త పాటలు వెలువడ్డాయి. ఇవి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

పండుగ ప్రాముఖ్యత

1. స్త్రీల ఏకత్వం మహిళల సామాజిక, సాంస్కృతిక బంధాలను బలపరుస్తుంది.

2. ప్రకృతి ఆరాధన %-% పూల పూజ ద్వారా పర్యావరణానికి గౌరవం.

3. సామాజిక ఐక్యత %-% పాటలు, ఆటలతో గ్రామీణ జీవనంలో ఆనందం, సహజీవనం పెంపొందుతుంది.

4. సంస్కృతి పరిరక్షణ %-% తెలంగాణ సంప్రదాయాలను తరతరాలకు చేరవేస్తుంది.

ముగింపు

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం, ఆత్మగౌరవానికి చిహ్నం. పూలతో దేవతలను పూజించే సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా ఉన్నా, పూలనే దేవతగా పూజించే ఆచారం మాత్రం తెలంగాణలోనే ఉంది. అందుకే బతుకమ్మను "తెలంగాణ ఆత్మ"గా విశ్లేషించవచ్చు

# కర్నూలులో గోల్డ్ మైన్

## ఆ గ్రామాలు.. బంగారం

కర్నూలు సెప్టెంబర్ 19, దేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని ఆంధ్రప్రదేశ్‌లోనే త్వరలో అందుబాటులోకి రానున్నాయి. త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు ఆ బంగారు గనిని నిర్వహిస్తున్న సంస్థ వెల్లడించింది. మొదట తక్కువ స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించి.. ఆ తర్వాత దాన్ని భారీగా పెంచనున్నట్లు సదరు సంస్థ తెలిపింది. ఈ బంగారు గని పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. దేశ బంగారం అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం కాస్త తగ్గుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బంగారం అంటే భారత్‌లో కేవలం ఒంటిపై వేసుకునే ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. అదో ఆస్తిగా కూడా భావిస్తారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో బంగారానికి అత్యంత ప్రాధాన్యత కూడా ఉంటుంది. అందుకే భారతీయులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తారు. వాటిని అవసరమైన సమయాల్లో తాకట్టు పెట్టి.. డబ్బును తీసుకుంటారు. అయితే ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా ఎక్కువగా బంగారాన్ని భారత్ వినియోగిస్తున్నా.. ఉత్పత్తిలో మాత్రం చాలా వెనకబడి ఉంది. ఇక మన దేశం.. విదేశాల నుంచి చమురు తర్వాత అత్యంత ఎక్కువగా దిగుమతి చేసుకునేది బంగారమే కావడం గమనార్హం. అయితే తాజాగా భారత్‌లోనే తొలి అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని నుంచి బంగారాన్ని వెలికితీయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిదిరాయి గ్రామాల్లో ఉన్న ఈ బంగారు గని నుంచి బంగారాన్ని వెలికితీసే ప్రాజెక్టును డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) నిర్వహిస్తోంది. ఈ సంస్థ త్వరలోనే ఆ ప్రాంతంలో బంగారం ఉత్పత్తిని ప్రారంభించనుంది. ఈ గని దేశం బంగారు ఉత్పత్తిని గణనీయంగా పెంచనుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటా భారత్ సుమారు వెయ్యి టన్నుల బంగారాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. చమురు తర్వాత బంగారం దేశంలో అత్యధికంగా దిగుమతి అయ్యే వస్తువు కావడం విశేషం. ప్రస్తుతం భారత్ మొత్తం బంగారు ఉత్పత్తి కేవలం 1.5 టన్నులు మాత్రమే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే జొన్నగిరి బంగారు గని పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడం భారత్‌కు బంగారం విషయంలో ఒక కీలక ముందడుగుగా మారుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్న జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్‌లో డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థకు వాటా ఉంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు ఇప్పటికే లభించాయని.. రాష్ట్ర అనుమతులు కూడా కోరుతున్నట్లు డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ ఎండీ హనుమ ప్రసాద్ గురువారం వెల్లడించారు. ఇక ఈ గనిని ప్రారంభించిన తర్వాత తొలి దశలో.. ఏటా సుమారు 750 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత రానున్న 2, 3 ఏళ్లలో ఈ బంగారం ఉత్పత్తిని ఏటా వెయ్యి కిలోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ వెల్లడించారు. కర్నూలు జిల్లాలో ఉన్న ఈ గోల్డ్ మైన్ నుంచి ఉత్పత్తి ప్రారంభం అయిన తర్వాత.. భారత దేశీయ బంగారు ఉత్పత్తి దాదాపు ఒక టన్ను మేర పెరుగుతుందని హనుమ ప్రసాద్ వివరించారు. ఈ ప్రాజెక్ట్ దేశ బంగారు పరిశ్రమలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖిస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్న డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థకు కిర్గిస్తాన్, ఫిన్లాండ్, టాంజానియా వంటి దేశాల్లో కూడా మైనింగ్ ప్రాజెక్టులను కలిగి ఉంది.

## రాజకీయాలకు దూరంగా వల్లభనేని

విజయవాడ సెప్టెంబర్ 19, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైదరాబాద్ లోనే ఉంటున్నారు. రాజకీయాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ఆయన జైలు నుంచి విడుదలయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకూ గన్నవరం నియోజకవర్గంలో పర్యటించకపోవడం వెనక కారణమదేనని అంటున్నారు. వల్లభనేని వంశీ కుటుంబ సభ్యులు కూడా రాజకీయాలు మానుకుని, వ్యాపారాలు చూసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది. రాజకీయాల వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, దానికంటే వ్యాపారాలు చేసుకోవడమే బెటరన్న అభిప్రాయంలో వల్లభనేని వంశీ కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో ఆయన కూడా పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు. వల్లభనేనేని వంశీ విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదల అయి రెండు నెలలు పైనే అవుతుంది. అన్ని కేసుల్లో బెయిల్ రావడంతో జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. వల్లభనేని వంశీపై పదకొండు కేసులు నమోదు కావడంతో దాదాపు 137 రోజుల పాటు విజయవాడ జిల్లా జైలులోనే ఉన్నారు. కొన్ని కేసుల్లో ముందస్తు బెయిల్, మరికొన్నికేసుల్లో షరతులతో కూడిన బెయిల్ లభించింది. పోలీస్ స్టేషన్లలో సంతకాలు చేయాలన్న షరతులను ఆయన పాటిస్తున్నారు. అంతే తప్ప రాజకీయాల జోలికి మాత్రం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోవడం లేదు. అదే సమయంలో జైలు నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కలసిన తర్వాత మళ్లీ కనిపించకుండా పోయారు. . కానీ గన్నవరం నియోజకవర్గానికి త్వరలో వల్లభనేనేని వంశీ వస్తారని నియోజకవర్గంలోని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ముఖ్య కార్యకర్తలతోవల్లభనేనేని వంశీ టచ్ లో ఉన్నారని, ఫోన్ లో మాట్లాడుతున్నారని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వస్తారని అంటున్నారు. జైల్లో ఉన్న సమయంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధి రావడంతో ఆయన ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆరోగ్యం పడిన తర్వాత తిరిగి గన్నవరం నియోజకవర్గానికి వల్లభనేనేని వంశీ వస్తారని అంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ఉన్న వల్లభనేనేని వంశీ ఆరోగ్య పరీక్షలు తరచూచేయించుకుంటున్నారని అంటున్నారు. మొత్తం మీద వంశీ రాజకీయాలను వదిలేస్తారన్న ప్రచారం మాత్రం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతుంది. ఇందులో నిజమెంత? అన్నది తెలియాలంటే ఆయన మాత్రమే క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# ఎట్టకేలకు మౌనం వీడిన ధర్మాన

శ్రీకాకుళం, సెప్టెంబర్ 19, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు మౌనం వీడారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయినట్లు సంకేతాలు పంపించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ధర్మాన ప్రసాదరావు పెద్దగా కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలకు సైతం హాజరు కావడం లేదు. దీంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ లో ఉన్నారా? లేదా? అన్న అనుమానం కూడా కలిగింది. ఒకానొక దశలో ఆయన తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం నడిచింది. ముఖ్యంగా జనసేనలో చేరుతారని టాక్ నడిచింది. కానీ 15 నెలలు అవుతున్న ఆయన రాజకీయ నిర్ణయంలో ఎటువంటి సంచలనాలు నమోదు కాలేదు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు ధర్మాన ప్రసాదరావు. ఈ తరుణంలో ఆయన మౌనం వీడారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేశారు. దీంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారని స్పష్టమైంది. ఉమ్మడి ఏపీ లోనే సీనియర్ మోస్ట్ లీడర్ ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించారు. యువజన కాంగ్రెస్ ద్వారా ఎంట్రీ ఇచ్చారు. తొలుత సర్పంచ్ గా, తరువాత ఎంపీపీగా, అటు తరువాత ఎమ్మెల్యేగా గెలిచి సుదీర్ఘకాలం మంత్రిగా కూడా వ్యవహరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయన ప్రధాన అనుచరుడిగా వ్యవహరించారు. 2004 నుంచి 2014 వరకు సుదీర్ఘకాలం మంత్రిగా ఉండేవారు. తండ్రి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీని వీడారు జగన్ మోహన్ రెడ్డి. ఆ సమయంలో జగన్ వైఖరిని వ్యతిరేకించారు ధర్మాన ప్రసాదరావు. ఒకానొక సమయంలో జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు కూడా చేశారు. కానీ 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంది. దీంతో జగన్మోహన్ రెడ్డి గత్యంతరం లేని స్థితిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల కు ముందు వైసీపీలోచేరారు ధర్మాన ప్రసాదరావు. అప్పటికే ఆయన సోదరుడు కృష్ణదాస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ రోల్ ప్లే చేస్తూ వచ్చారు. అప్పటివరకు జగన్ వైఖరిని వ్యతిరేకించిన ధర్మాన ప్రసాదరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆ ప్రభావం 2014 ఎన్నికల్లో పడింది. ధర్మాన సోదరులు ఇద్దరూ ఓడిపోయారు. అయితే ధర్మాన తన శక్తి యుక్తులను ఉపయోగించి 2019లో శ్రీకాకుళం జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో మంత్రి పదవి ఖాయమని అంచనా వేసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి మాత్రం ధర్మాన ప్రసాదరావు సోదరుడు కృష్ణ దాస్ కు మంత్రి పదవి ఇచ్చారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ధర్మాన ప్రసాదరావు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. విస్తరణలో చోటిచ్చేసరికి మళ్ళీ యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు. 2024 ఎన్నికల్లో తన రాజకీయ జీవితంలో ఎదురుకాని ఓటమి ధర్మాన ప్రసాదరావుకు ఎదురయ్యింది. టిడిపి అభ్యర్థిగా ఓ సామాన్య సర్పంచ్ బరిలో దిగగా.. 52 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు ధర్మాన ప్రసాదరావు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగితే తనకు భవిష్యత్తు ఉండదని భావించారు. తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఉండాలంటే జనసేనలో చేరడం ఉత్తమం అని భావించారు. ఒకానొక దశలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరుతారని.. రాజ్యసభ పదవి ఆఫర్ వచ్చిందని ప్రచారం నడిచింది. అయితే కూటమి పార్టీల నుంచి సానుకూలత లేకపోవడంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగేందుకు దాదాపు సిద్ధపడినట్లు ప్రచారం సాగుతోంది. తాజాగా కూటమి ప్రభుత్వంపై ధర్మాన విమర్శలు చూస్తుంటే ఆయన వైసీపీలో యాక్టివ్ అయినట్టు కనిపిస్తోంది. మరి చూడాలి ధర్మాన వ్యవహార శైలి మున్ముందు ఎలా ఉండబోతుందో..

# అటెండన్స్ పై స్పీకర్ సీరియస్

విజయవాడ, సెప్టెంబర్ 19,ఎమ్మెల్యేల అటెండెన్స్ మీద సాక్షాత్తు అసెంబ్లీ స్పీకరే ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రావడానికి మీకొచ్చిన ఇబ్బంది ఏంటని డైరెక్ట్‌గానే ప్రశ్నిస్తున్నారు స్పీకర్. జనం మిమ్మల్ని ఎన్నుకుంది, మీకు జీతాలిస్తోంది కూడా సభకు వచ్చి సమస్యల మీద మాట్లాడమనేకదా అన్నది ఆయన క్వశ్చన్. అంతే కాకుండా అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకని అంటున్నారాయన?.తిరుపతిలో జరిగిన పార్లమెంట్ మహిళా సాధికారత సమావేశంలోను, ఎన్టీఆర్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమలోనూ అవే వ్యాఖ్యల్ని రిపీట్ చేశారాయన. ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడం మనేశారు. జగన్‌కు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తేనే.. గేటుదాటి లోపలికి వస్తామన్నది వైసీపీ వెర్షన్. దీంతో స్పీకర్ ఎవర్ని ఉద్దేశించి పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారన్న గుసగుసలు స్టార్ట్ అయ్యాయి. ఆయన కేవలం వైసీపీ ఎమ్మెల్యేలను దృష్టిలో పెట్టుకునే అలా మాట్లాడుతున్నారా? లేక సొంత కూటమిలోని శాసనసభ్యులను కూడా కలిపి చురకలంటిస్తున్నారా అన్న చర్చలు నడుస్తున్నాయి ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో. కేవలం వైసీపీ విషయంలోనే అయితే? దాని గురించి ఇప్పటికే రకరకలా విమర్శలు వచ్చాయి, వస్తున్నాయి. కనీసం ఒక్కసారి కూడా అటెండ్ అవకుంటే అసెంబ్లీ రూల్స్ ప్రకారం నిర్ణయాలు ఉంటాయి, అది వేరే సంగతి. కానీ స్పీకర్ రిపీటెడ్‌గా అదే అంశాన్ని నొక్కి చెబుతుండటంతో? ఇది కూటమి ఎమ్మెల్యేలకు కూడా ఒక హెచ్చరికా అన్న అనుమానాలు కలుగుతున్నాయట పొలిటికల్ సర్కిల్స్‌లో. వైసీపీ ఎలాగూ అధికారికంగా ప్రకటించి మరీ? దూరంగా ఉంది. గత అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షం శాసనసభ్యుల హాజరు కూడా? చాలా తక్కువగా ఉందట. రెండు రోజుల పాటు సగం మంది ఎమ్మెల్యేలు కూడా సభలో లేని పరిస్థితి. దీన్ని గమనించే? ఈసారన్నా ఒళ్ళు దగ్గర పెట్టుకుని సభకు హాజరవమంటూ స్పీకర్ పరోక్షంగా కూటమి నేతలకు కూడా వార్నింగ్ ఇచ్చినట్టు కనిపిస్తోందని అంటున్నారు. సభకు రాని వాళ్ళకు జీతాలెందుకని వైసీపీతో పాటు కూటమి ఎమ్మెల్యేలను కూడా దృష్టిలో ఉంచుకునే అన్నారన్నదే విశ్లేషకుల అభిప్రాయం. కేవలం వైసీపీ విషయంలోనే అయితే? ఆయన అంత స్ట్రాంగ్‌గా చెప్పబోరని, మొత్తం సభను ఉద్దేశించే ఘాటు వ్యాఖ్యలు చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. గత సెషన్ క్వశ్చన్ అవర్‌లో వైసీపీ సభ్యులు ప్రశ్నల్ని లిఖిత పూర్వకంగా పంపేసి అసెంబ్లీకి రాలేదు. దీంతో? కనీసం ప్రశ్నలు అడగడానికైనా వాళ్ళు వచ్చి వెళ్ళాల్సిందని అభిప్రాయపడ్డారట అయ్యన్న పాత్రుడు. అదే విధంగా కూటమి సభ్యుల హాజరు శాతం బాగా తక్కువగా ఉండటాన్ని కూడా దృష్టిలో పెట్టుకునే ఆయన రిపీటెడ్ కామెంట్స్ చేస్తున్నట్టు సమాచారం. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలవబోతున్నాయి. స్పీకర్ ఆవేదనను, వ్యాఖ్యల సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకుని ఈసారన్నా అంతా వస్తారా? సభ నిండుగా కనిపిస్తుందా లేదా అన్నది చూడాలి.ః

# చిక్కడు..దొరకడు.. శ్రీనివాసుడు

తిరుపతి, సెప్టెంబర్ 19, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన పోటీ చేసి గెలిచిన ఏకైక అసెంబ్లీ సీటు తిరుపతి. ఆరణి శ్రీనివాసులు ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అయ్యారు. ఉమ్మడి జిల్లాలో పోటీ చేసింది ఒకే సీటు అయినా?ఎన్నికల టైంలో? ఆ గెలుపు సౌండ్ మాత్రం రాయలసీమ మొత్తంలో ప్రతిధ్వనించింది. చివరి నిమిషంలో సీటు దక్కినా? 60వేలకు పైగా భారీ మెజారిటీతో ఆరణి విజయం సొంతం చేసుకోవడం గురించి అప్పట్లో బాగా మాట్లాడుకున్నారు. ఎన్నికలకు ముందు వరకు వైసీపీ ఎమ్మెల్యే గా ఉన్న శ్రీనివాస్‌కు సీటు ఇవ్వడాన్ని తిరుపతి టిడిపి, జనసేన నేతలు తీవ్రంగా వ్యతిరేకించినా.. పవన్ కళ్యాణ్ మాత్రం ఆయనవైపే మొగ్గారు. సరే? పెద్దోళ్ళు నిర్ణయం తీసుకున్నారు, ఇక చేసేదేముందనుకుంటూ? అంతా కలిసి పని చేయడంతో భారీ మెజార్టీ సాధ్యమైందన్నది స్థానికంగా ఉన్న అభిప్రాయం. ఇక గెలిచాక? చాలామంది ఎమ్మెల్యేల్లాగే? ఆరణి కుటుంబ సభ్యులు కూడా సీన్‌లోకి ఎంటరైపోయారు. ఆగడాలు శృతిమించుతున్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో?. డైరెక్ట్‌గా పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకుని ఎమ్మెల్యేకి క్లాస్ పీకినట్టు చెప్పుకున్నారు. అది నిజమేనా అన్నట్టు కొన్నాళ్ళుగా?. ఆరోపణల పరంపర తగ్గిపోయింది. ఆరణి కూడా తిరుపతి నగర అభివృద్ధి మీదే దృష్టి పెట్టారన్న మాటలు వినిపిస్తున్నాయి. అంతవరకు బాగానే ఉందని అనుకుంటున్నా?. ఈ మధ్యకాలంలో మాత్రం ఆయన వ్యవహారం గురించి కూటమి నేతల్లో కొత్త చర్చ జరుగుతోందట. ఎమ్మెల్యే కేవలం శంకుస్థాపనలు, సమస్యల పరిష్కారం అంటూ తిరుగుతున్నారు తప్ప? రాజకీయంగా ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని, అది వైసీపీకి అలుసుగా మారుతోందని మాట్లాడుకుంటున్నట్టు తెలిసిందఎమ్మెల్యేకి ఇప్పటికీ సొంత పార్టీలోని కొందరితో పాటు? టీడీపీ నాయకులతో కూడా గ్యాప్ ఉన్నట్టు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అయినాసరే? ఆ గ్యాప్‌ని తగ్గించుకునేందుకు ఆరణి వైపు నుంచి చొరవలేదని కూటమి నాయకులు అసహనంగా ఉన్నారట. పైగా? నియోజకవర్గంలో మారుతున్న తాజా రాజకీయ పరిస్థితుల్లో ఆయన మౌనం ఎందుకంటూ కూటమి కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఓవైపు తిరుపతి వైసీపీ లీడర్స్ చెలరేగుతున్నా? ఇక్కడ ఆరణి శ్రీనివాస్ వైపు నుంచి మాత్రం నో రియాక్షన్ అంటూ స్థానిక నాయకులు కొందరు జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను, టీడీపీని టార్గెట్ చేసుకుంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న విమర్శలకు ఆశించిన స్థాయిలో కాదు కదా? అసలు ఎదుర్కొనే కనీస ప్రయత్నం కూడా ఎమ్మెల్యే వైపు నుంచి జరగడం లేదని రగిలిపోతున్నారట జనసైనికులు. భూమన కరుణాకర్ రెడ్డి గోశాల సహా?. తిరుమల టార్గెట్‌గా పలు వివాదాలను తెరపై తెస్తూ? రోజుకో ప్రెస్ మీట్‌తో ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, మొత్తం ప్రభుత్వాన్నే ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుంటే? స్థానిక ఎమ్మెల్యేగా ఉంటూ? ఆరణి శ్రీనివాస్ ఎందుకు కౌంటర్ చేయలేకపోతున్నారని సోషల్ మీడియా వేదికగా ఓ రేంజ్ లో ఆడేసుకుంటున్నారట జనసేన కార్యకర్తలు.

నగర అభివృద్ధి అంటూ ఎమ్మెల్యే తిరగడం వందకు వంద శాతం కరెక్టేగానీ?అదే సమయంలో ప్రత్యర్థులు ప్రభుత్వాన్ని డ్యామేజ్ చేస్తుంటే? చూస్తూ ఊరుకోవడం కూడా కరెక్ట్‌కాదు కదా అన్న మాటలు వినిపిస్తున్నాయి కూటమి నాయకుల నుంచి. తాజాగా భూమన ఓ విగ్రహ వివాదాన్ని తెరపైకి తెచ్చి సనాతన ధర్మ యోధుడు పవన్ కళ్యాణ్ ఎక్కడ అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు? అదే స్థాయిలో ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును టార్గెట్ చేశారాయన. అది రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్..ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందనిఖండించాల్సిన ఎమ్మెల్యే.. ఆ బాధ్యత ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారట జనసైనికులు. స్థానిక టిడిపి నేతలు కొందరు భూమన తీరును ఖండించారు తప్ప ఎమ్మెల్యే మాత్రం? నాకేం తెలియదు అన్నట్టు ఉండటంపై జనసేన పెద్దలు కూడా అసహనంగా ఉన్నట్టు తెలుస్తోంది. రాయలసీమలో గెలిచిన ఏకైక బలిజ సామాజి వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఆరణి. ఆయన రికార్డ్ మెజార్టీతో గెలిచినప్పుడు వినిపించిన సౌండ్ ఇప్పుడేమైందంటూ? సెటైర్స్ వేస్తున్నారు కూటమి నాయకులు. తాను తిరుమలకు కూడా ఎమ్మెల్యేని అన్న సంగతిని ఆయన మర్చిపోయారా? లేక వైసీపీలో ఉన్నప్పటి పాత పరిచయాలు గుర్తుకువచ్చి ఇప్పుడు నోరు పెగలడం లేదా అంటూ ఘాటుగా రియాక్ట్ అవుతున్నారు తిరుపతి జనసైనికులు. ఇదే సమయంలో మరో వాదనా వినిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పనీపాటా లేకుండా రోజుకొక ప్రెస్ మీట్ పెట్టి తిరుమల కొండ లక్ష్యంగా ఏదో ఒక అసత్య ప్రచారం చేస్తుంటారని, ఆయన చేసే టైంపాస్ పాలిటిక్స్‌కు ప్రతిరోజు నేను రియాక్ట్ అవ్వాల్సిన అవసరం లేదన్న అభిప్రాయంతో ఆరణి ఉన్నారంటూ వెనకేసుకొస్తున్నారు ఆయన సన్నిహితులు.

కానీ? ప్రతిదానికీ రియాక్ట్ అవకున్నా? తీవ్ర స్థాయి ఆరోపణలు వచ్చి, పార్టీకి, ప్రభుత్వానికి పెద్ద డ్యామేజ్ జరుగుతున్నప్పుడు, మత పరంగా సున్నితమైన వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకోకుంటే? ఇక ఎమ్మెల్యే ఉండి కూడా ఏం లాభం అన్నది తిరుపతి కూటమి నేతల క్వశ్చన్.

# జగన్ డ్యామేజీ...టీడీపీకి మైలేజీ

విజయవాడ, సెప్టెంబర్ 19, వైసీపీ అధినేత జగన్ మౌనంగా ఉండటం మంచిదేమో.. ఎందుకంటే ఏ సమస్యపై స్పందించినా వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దానిపై స్పందిస్తున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీ విపక్ష పార్టీలు చేసే విమర్శలు పెద్దగా కేర్ చేయదు. గతంలో చంద్రబాబు, జగన్ లు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనూ అదే చేసేవారు. విపక్ష విమర్శలను లెక్కపెట్టేవారు కాదు. అది విపక్షానికి ప్లస్ గా మారేది. అధికారంలో ఉన్న పార్టీకి మైనస్ అయ్యేది. కానీ ప్రస్తుతం చంద్రబాబు నాయుడు విపక్ష వైసీపీ లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన నిర్ణయం తీసుకోవడమే కాకుండా వెనువెంటనే ఆదేశాలు జారీ చేస్తుండటంతో వైసీపీకి రావాల్సిన మైలేజీ రాకుండా పోతుంది. ఉదాహరణకు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేదంటూ జగన్ విమర్శించి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. వెంటనే కేంద్రమంత్రిని పిలిపించి పొగాకు బోర్డు తో మాట్లాడి ధరను కొంత పెంచేలా చేశారు. ఇక చిత్తూరు మామిడి విషయంలోనూ అదే జరిగింది. అలాగే పొగాకుకు తగిన గిట్టుబాటు ధరలేదని పొదిలికి జగన్ వెళితే పొగాకుకు కూడా అప్పటి వరకూ వస్తున్న దానికంటే కొంత మొత్తాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మామిడిపండ్ల రైతులను పరామర్శించడానికి బంగారుపాళ్యం జగన్ వెళ్లడానికి ముందే ధరలు పెంచేశారు చంద్రబాబు. ఇలా అన్ని రకాలుగా రైతుల విషయంలో జగన్ అక్కడకు వెళ్లి పరామర్శ కు దిగక ముందే చంద్రబాబు చర్యలు తీసుకుంటుండటంతో భారీగా రావాల్సిన మైలేజీ రాకుండా పోతుంది. వెనువెంటనే యూరియా తగ్గించి వాడితే బస్తాకు తమ ప్రభుత్వం ఎనిమిది వందల రూపాయలు ఇస్తామని ప్రకటించి చంద్రబాబు నాయుడు వైసీపీని డిఫెన్స్ లో నెట్టేశారు. ఇక దీంతో వైసీపీ ప్రభుత్వ మెడికల్ కళాశాలవైపునకు మళ్లింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయవద్దని ఆందోళనలకు దిగాలని వైసీపీ నిర్ణయించింది. అయితే సామాన్య ప్రజలకు ఈ అంశంతో నేరుగా కనెక్షన్ లేకపోవడంతో తాము పీపీపీ పద్ధతిలోనే వెళుతున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఇలా వైసీపీ అధినేత జగన్ ఏ అంశాన్ని భుజానకెత్తుకున్నా ఆలోపే రివర్స్ లో చంద్రబాబు తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో వైసీపీకి రావాల్సిన మైలేజీ రావడం లేదన్న చర్చ వైసీపీలో ఎక్కువగా జరుగుతుంది.

# దిగొస్తున్న అమెరికా...

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్) అత్యధిక సుంకాల తర్వాత భారత్, అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇండియాపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య దూరం కాస్త పెరిగిందనే చెప్పాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తనకు చాలా క్లోజ్ అంటూ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న మోదీ పుట్టిన రోజు సందర్భంగా మోదీకి ఫోన్ చేసిన మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు."నేను ఇండియాకి, మోదీకి చాలా క్లోజ్. మొన్న మోదీతో మాట్లాడాను. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాను. మాకు చాలా మంచి సంబంధం ఉంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పటికే సుంకాల ఉద్రిక్తతలను పరిష్కరించే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారత్, అమెరికా చర్చలు జరుపుతున్నాయి. నవంబర్ 30 తర్వాత వాషింగ్టన్ 25 శాతం జరిమానా సుంకాలను ఉపసంహరించుకోవచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అన్నారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలు గతంలో ఆయన ఇండియా గురించి చేసిన ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. రష్యాతో చమురు వ్యాపారంపై ఇండియాపై ఆయన విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి పుతిన్‌కు నిధులు సమకూర్చడంలో ఇండియా సహాయపడుతుందని ఆరోపించారు. ఇదే కారణంగా ఆయన భారత దిగుమతులపై అదనంగా 25 శాతం సుంకాలను విధించి, మొత్తం సుంకాలను 50 శాతానికి పెంచారు. కానీ, ఇప్పుడు రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు తిరిగి ప్రారంభం కావడంతో పాటు ఇద్దరు నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ట్రంప్ శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాని మోదీ చర్చల గురించి ప్రస్తావిస్తూ "భారత్-అమెరికా సమగ్ర, ప్రపంచ భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని వెల్లడించారు.

# రష్యాలో భారీ భూకంపం

మాస్కో , సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్ రష్యాలో అర్ధరాత్రి భారీ భూకంపం సంభవించింది. పెట్రోపావ్లోవ్స్- కామ్చట్కా ప్రాంతంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై ఈ భూకంపం తీవ్రత 7.8గా నమోదు అయినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. భారీ భూకంపం సంభవించడంతో సునామీ వార్నింగ్ జారీ చేసింది. పలుచోట్ల భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు వెల్లడించలేదు.భారీ భూకంపం కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భూకంపానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఇందులో ఇంట్లో ఫర్నిచర్, లైట్లు వేగంగా కదులుతున్నట్లు కనిపిస్తున్నాయి. వారం రోజుల కిందట కూడా రష్యాలో భారీ భూకంపం సంభవించింది. కామ్చట్కా ప్రాంతంలో 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. అనంతరం అధికారులు సునామీ హెచ్చరిక జారీ చేశారు. ఇండోనేషియాలోనూ శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.3గా నమోదైంది. సెంట్రల్ పపువా ప్రావిన్స్, పశ్చిమ పపువాలో శుక్రవారం వేకువ జామున పలుచోట్ల భూమి కంపించింది. 28 కి.మీ దూరంలో, 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది.రష్యాలోని కామ్చట్కాలో సంభవించిన భూకంపం వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రోడ్ల మీద ఆపిన కార్లు సైతం భూకంపం తీవ్రతకు ఊగిపోవడం వీడియోలో చూడవచ్చు. వరుస భూకంపాలతో ఈ ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# ఇక ప్రజాక్షేత్రంలోనే వైసీపీ...

# కుండబద్దలు కొట్టిన జగన్



విజయవాడ, సెప్టెంబర్ 19, ఏపీ రాజకీయాల్లో ఎట్టకేలకు ఫుల్ క్లారిటీ వచ్చింది. శాసనసభ సమావేశాలకు హాజరు విషయంలో జగన్మోహన్ రెడ్డి పూర్తి సంకేతాలు ఇచ్చేశారు. సభకు వచ్చేది లేదని తేల్చేశారు. ఇక ప్రజల మధ్య తేల్చుకుంటామని గట్టిగానే చెప్పారు. ప్రతిపక్ష హోదా ఇస్తే కానీ అసెంబ్లీకి రామని తేల్చి చెప్పిన జగన్.. అన్నంత పని చేశారు. తాను గైర్ హాజరు కావడమే కాకుండా.. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా ఎవరు హాజరుకాకుండా కట్టడి చేయగలిగారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిని విభేదించి కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారు అంటూ జరిగిన ప్రచారం చివరకు ఉత్తదేనని తేలిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండుసార్లు మాత్రమే సభకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో, గవర్నర్ ప్రసంగ సమయాల్లో మాత్రమే రెండుసార్లు సభకు వచ్చారు. అప్పటినుంచి గైర్హాజరవుతూ వచ్చారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తామని తేల్చి చెప్పారు. అయితే అది తాము ఇచ్చేది కాదని.. సభకు వస్తే తగిన సమయం కేటాయిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పుకొచ్చారు. కానీ ఇవేవీ ఫలించలేదు. ఈరోజు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు జగన్తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు రాలేదు.భారీ ఎత్తున ఆందోళనలకు సిద్ధం కావాలని వైసీపీ క్యాడర్ జగన్ పిలుపునిచ్చారు. పేదలకొరకు అవసరమైతే దీనిపై న్యాయపోరాటాలు చేస్తాం, వారికి అండగా నిలబడతాం. ధర్నాలు, నిరసనలు, ఆందోళనలకు సిద్దమవుతామన్నారు. ఈ మేరకు ట్విట్టర్ లో వైఎస్ జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చింది పేదలపై కత్తికట్టడానికా? వారి సొంతింటి కలలను నాశనం చేయడానికా? మీది పేదలకు ఏదైనా ఇచ్చే ప్రభుత్వం కాదని, వారికి అందుతున్నవాటిని తీసివేసే రద్దుల ప్రభుత్వం అని, మీరు పేదల వ్యతిరేకి అని మరోసారి నిరూపణ అయ్యింది. పేద అక్కచెల్లెమ్మలకు రిజిస్ట్రేషన్ చేసిమరీ ఇచ్చిన ఇళ్లస్థలాలను రద్దు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? వాళ్లు ఇళ్లు కట్టుకునేలా అండగా నిలబడాల్సింది పోయి, మా హయాంలో ఇచ్చిన స్థలాలను లాక్కుంటారా? అక్కచెల్లెమ్మల ఉసురు పోసుకుంటారా? తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీ హయాంలో ఇళ్ల పట్టాలూ ఇవ్వక, ఇళ్లూ కట్టించక పేదలు ఎంతోమంది నిరాశ్రయులుగా మిగిలిపోయారని ఆరోపించారు. కాని మేము వారి సొంతింటి కలను నిజం చేసేలా "పేదలందరికీ ఇళ్లు" కార్యక్రమం కింద 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఇచ్చి, వారి పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు. ఇందులో కొనుగోలుకే రూ.11,871 కోట్లు ఖర్చుచేశాం. మా ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల విలువ మార్కెట్ రేట్లతో చూస్తే రూ.1.5లక్షల కోట్లపైమాటేనని చెప్పుకొచ్చారు. టిపట్టావిలువే ఒక్కోచోట రూ. 2.5 లక్షల నుంచి రూ.10లక్షలు - రూ.15లక్షల వరకూ ఉంది. ఇళ్లపట్టాలకోసం, ఇళ్లకోసం ధర్నాలు, ఆందోళనలు మా ఐదేళ్లకాలంలో కనిపించకపోవడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం. మా హయాంలో మేం 21.75 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని శాంక్షన్ చేయించి, మొదలుపెట్టడం ద్వారా ఏకంగా 17,005 కాలనీలు ఏర్పడ్డాయి. కోవిడ్‌లాంటి సంక్షోభాలను ఎదుర్కొంటూ అనతి కాలంలోనే ఇందులో 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేశాం. అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లను ప్రారంభించి చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించాం. చంద్రబాబుగారూ మీ జీవితంలో ఎప్పుడైనా ఇలా చేయగలిగారా? అలా చేయకపోగా ఇప్పుడు మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని ఎందుకు నిలిపేశారు? ఇది పేదల ఆశలను వమ్ము చేయడం కాదంటారా అని ప్రశ్నించారు. మా హయాంలో లబ్ధిదారులకు సిమెంటు, స్టీలు, వంటి నిర్మాణానికి అవసరమైన దాదాపు 12 రకాల సామాన్లు తక్కువ ధరకే అందించాం. ఈ రూపంలో ప్రతి లబ్ధిదారునికి రూ.40వేలు మేలు జరగడమే కాకుండా, దీంతోపాటు 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందించి మరో రూ.15వేలు సహాయం చేశాం. మరో రూ.35వేలు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చి, ఆ వడ్డీ డబ్బును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం ద్వారా ఇంటి నిర్మాణానికి అండగా నిలబడ్డాం. ఈ రకంగా ప్రతి ఇంటికీ కేంద్రం ఇచ్చే రూ.1.8లక్షలు కాక, మొత్తంగా రూ.2.7లక్షల లబ్ధి చేకూర్చడమే కాకుండా, మౌలిక సదుపాయాల కొరకు మరో రూ.1లక్ష కూడా ఖర్చు చేసుకుంటూ పోయామన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కొరకు, మురికికూపాలుగా ఉండకూడదని, నీరు, కరెంటు, డ్రైనేజీ, ఇంకుడుగుంతలు, రోడ్లు తదితర సదుపాయాలకోసం దాదాపుగా రూ.3,555 కోట్లు మా హయాంలో ఖర్చుచేశాం. ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా మొత్తంగా మేం చేసిన ఖర్చు దాదాపుగా రూ.35,300 కోట్లు. ఈ 16-17 నెలల కాలంలో మీరెంత ఖర్చుచేశారని ప్రశ్నించారు. మా హయాంలో "పేదలకు ఇళ్లు" కార్యక్రమం ముందుకు వెళ్లకూడదని మీరు చేయని పన్నాగంలేదు. మీ పార్టీ నాయకుల ద్వారా మీరు కోర్టులో కేసులు వేయించారు. అమరావతిలో 50వేల పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్లపట్టాలు ఇస్తే, సామాజిక అసమతుల్యత వస్తుందని కోర్టుల్లో వాదించి స్టేలు తేవడమే కాకుండా, అధికారంలోకి రాగానే కర్కశంగా వ్యవహరించి ఇచ్చిన ఆ పట్టాలను రద్దుచేసి విజయవాడ, గుంటూరు నగరాల్లోని పేదలకు తీరని ద్రోహం చేశారు. మరి మీరు చేసింది ద్రోహం కాదా? పేద కుటుంబాలమీద మీరు కక్ష తీర్చుకోవడం లేదా? ఇది చాలదు అన్నట్టు, ఇక మిగిలిన పట్టాల్లో ఎక్కడైతే ఇంకా ఇళ్లు మీరు బాధ్యతగా శాంక్షన్ చేయించి, కట్టించాల్సింది పోయి, అక్కడ ఇంకా ఇళ్లు కట్టలేదు కాబట్టి, వాటిని, రిజిస్టర్ అయిన ఆ పట్టాలను, మీకు హక్కులేకపోయినా వెనక్కి తీసుకుని, మీ స్కాముల కొరకు, ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు కడతాం అంటూ ప్రకటనలు ఇవ్వడం మంచిది కాదన్నారు. ఈ 16-17 నెలల కాలంలో పేదలకు ఇళ్ల విషయంలో మీ పనితీరు చూస్తే సున్నా. మీరు అధికారంలోకి వస్తే మాకు మించి ఇస్తామన్నారు. కాని, ఇప్పటివరకూ ఒక్క ఎకరం గుర్తించలేదు, ఒక్క ఎకరం కొనలేదు. ఏ ఒక్కరికీ పట్టాకూడా ఇవ్వలేదు. ఎవ్వరికీ ఇల్లుకూడా ఇవ్వలేదు. పైగా ఇప్పుడు ఇచ్చినవాటిని లాక్కునే దిక్కుమాలిన పనులు చేస్తున్నారు. ఇంత చెత్తగా పరిపాలిస్తూ మరోవైపు పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాలను లాక్కుంటున్నారు. దీన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. పేదలకొరకు అవసరమైతే దీనిపై న్యాయపోరాటాలు చేస్తాం, వారికి అండగా నిలబడతాం. ధర్నాలు, నిరసనలు, ఆందోళనలకు సిద్ధం కావాల్సిందిగా కేడర్‌కు కూడా పిలుపునిచ్చారు.

# అమెరికాలో మాంద్యం ముప్పు

న్యూయార్క్ , సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్) అమెరికాలో మాంద్యం ముప్పు పెరుగుతోంది, కాబట్టి అక్కడి కేంద్ర బ్యాంకు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అంటే ఇప్పుడు అమెరికాలో రుణాలు తీసుకోవడం మునుపటి కంటే కొంచెం చౌకగా ఉంటుంది.ఈ సంవత్సరం చివరి నాటికి మరో రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని ఫెడరల్ రిజర్వ్ సూచించింది. వాస్తవానికి, అమెరికాలో జాబ్ మార్కెట్ గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయి. కొత్త ఉద్యోగాల కల్పన వేగం నెమ్మదించింది. నిరుద్యోగం పెరుగుతోంది. కాబట్టి, వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం పెట్టుబడులు, వినియోగాన్ని ప్రోత్సహించాలనుకుంటోంది.రుణాలు, హోమ్ లోన్ల ఇఓఎ తగ్గుతుంది. దీనివల్ల ప్రజల ఖర్చు చేసే సామర్థ్యం పెరుగుతుంది. విదేశీ పెట్టుబడిదారులు మళ్ళీ అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల వైపు మొగ్గు చూపవచ్చు, దీనివల్ల స్టాక్ మార్కెట్లో వృద్ధి ఉండవచ్చు. బంగారం-చమురు వంటి వస్తువుల ధరలలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు.ఉద్యోగ సృష్టి మందగించడం, పని గంటలు తగ్గడం, నల్లజాతి కార్మికుల్లో నిరుద్యోగం పెరగడంపై పెరుగుతున్న ఆందోళనల వేళ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాయిటర్స్ పేర్కొంది. ఈ హెచ్చరిక సంకేతాలతో నిర్ణయం తీసుకున్నట్టు ఫెడరల్ రిజర్వ్ చైర్ జెరోమ్ పావెల్ అన్నారు. "ప్రమాదరహిత మార్గాలు లేవు . ఏమి చేయాలో చాలా స్పష్టంగా లేదు" అని పావెల్ వ్యాఖ్యానించారు, ఫెడ్ గరిష్ట ఉపాధి లక్ష్యంతో ద్రవ్యోల్బణ నియంత్రణను సమతుల్యం చేయాలి అని పేర్కొన్నారు. నిరుద్యోగ రేటును స్థిరంగా ఉంచడానికి అవసరమైన స్థాయి కంటే నియామక వేగం పడిపోయిందని పావెల్ అంగీకరించారు. పరిమిత నియామకాలు, తొలగింపులలో స్వల్ప పెరుగుదలతో కలిపి, నిరుద్యోగం త్వరగా మరింత పెరుగుతుందని హెచ్చరించారు. "మైనారిటీ నిరుద్యోగం పెరుగుతుండటాన్ని చూస్తున్నారు. మొత్తం మీద తక్కువ జీతాల ఉద్యోగ సృష్టితో పాటు, మార్జిన్‌లో, కార్మిక మార్కెట్ బలహీనపడుతోందని తెలుస్తోంది. ఇకపై అది మృదువుగా ఉండాల్సిన అవసరం లేదు," అని ఆయన అన్నారు.అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేటు తగ్గింపు, ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రోత్సహించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేట్లను మరింత తగ్గించడానికి మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు గురువారం తెలిపారు.బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 4 శాతం నుంచి 4.25 శాతం శ్రేణికి తీసుకువచ్చే కోతను ప్రకటిస్తూ, ఈ సంవత్సరం మరో రెండు కోతలు ఉండవచ్చని ఫెడ్ సూచించింది.వడ్డీ రేటు తగ్గింపు, స్వల్పకాలిక మెచ్యూరిటీల కోసం ప్రభుత్వ సెక్యూరిటీల జారీని సమతుల్యం చేయడం ద్వారా కంపెనీలు, సాధారణంగా ఆర్థిక వ్యవస్థకు రుణ ఖర్చులు తగ్గించడం ద్వారా ఆశించిన ప్రభావాన్ని పొందవచ్చని ఎనిటతిజీఃనీనిటబ.ఇనీఎ సహ వ్యవస్థాపకుడు విశాల్ గోయెంకా అన్నారు."ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని రేటు కోతల అంచనాతో బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి మంచి సమయం" అని ఆయన పేర్కొన్నారు.మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్‌లో గ్లోబల్ ఈక్విటీస్ హెడ్ అరిందం మండల్ ప్రకారం, ఈఖఓఅ చర్య 25 బేసిస్ పాయింట్ల కోతతో అంచనాలకు అనుగుణంగా ఉంది, అవసరమైతే మిగిలిన సంవత్సరంలో మరో 2 కోతలను సూచిస్తుంది.ఈ సంవత్సరం చివరి నాటికి నిరుద్యోగిత రేటు 4.5 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నందున ఉద్యోగాల సంఖ్య కీలకం. సుంకాల కారణంగా ధరలు స్వల్పకాలంలో పెరుగుతాయని మాత్రమే కాకుండా, ద్రవ్యోల్బణం 2 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని వారు అంచనా వేస్తున్నందున ద్రవ్యోల్బణం ఆధారిత వ్యాఖ్యానం ఆసక్తికరంగా ఉంది, ఇది 2027 వరకు ఫెడ్ లక్ష్య ద్రవ్యోల్బణం. ఇది 7 సంవత్సరాల వరుస ద్రవ్యోల్బణం లక్ష్యం కంటే ఎక్కువగా ఉంటుందని సూచిస్తుంది" అని ఆయన వివరించారు.

# స్మార్ట్ ఫోన్లపై నియంత్రణ ఏదీ

భారతదేశంలో స్మార్ట్‌ఫోన్‌లు పిల్లల మానసిక, శారీరక భద్రతకు పెనుముప్పుగా మారుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల ద్వారా పోర్నోగ్రఫీ, హింసాత్మక కంటెంట్‌కు వ్యసనపరులవుతున్నారు. ఈ నేరాలు శ్రుతి మించకముందే ప్రభుత్వం వీటి నేపథ్యాన్ని అధ్యయనం చేసి చిన్న పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులో ఉండకుండా చర్యలు తీసుకోవాలి. సామాజిక అభ్యసన సిద్ధాంతం ప్రకారం ఇతరులను వ్యక్తులు, ముఖ్యంగా పిల్లలు గమనించడం ద్వారా, అనుకరించడం ద్వారా ప్రవర్తనలను నేర్చుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లలోని హింసాత్మక, అశ్లీల కంటెంట్ నిరంతర వీక్షణం వారిలో ఆ ప్రవర్తనలను సాధారణీకరించడానికి, సున్నితత్వాన్ని కోల్పోవడానికి దారి తీస్తుంది. ఇప్పటికే బ్రిటన్‌లో 16 ఏళ్ల లోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్ల విక్రయాన్ని నిషేదించే ప్రతిపాదనపై చర్చ జరుగుతుంది. భారత్‌లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఇక్కడ 11 ఏళ్లకే పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు వాడుతూ కాలం గడుపుతున్నారు. పెరుగుతున్న సెల్?ఫోన్? వినియోగం పిల్లల మీద తీవ్రంగా ప్రభావం చూపుతోంది. కొన్నేళ్ల క్రితం చందమామను చూపి భోజనం తినిపించే తల్లులు ప్రస్తుతం స్మార్ట్?ఫోన్?లను చూపిస్తున్నారు.

ఇక చదువు పేరుతో స్మార్ట్?ఫోన్? వినియోగానికి అలవాటైన పిల్లలు, యువతీ యువకులు వాటికి పూర్తిగా బానిసలవుతున్నారు. చుట్టూ ఉండే సమాజానికి మరింత దూరమవుతున్నారు. ఫ్యామిలీ మెంబర్లు, బంధువులు, స్నేహితులను కలిసి మాట్లాడే పరిస్థితి అనేదే కనిపించడం లేదు. నిత్యం సెల్‌ఫోన్‌లో రీల్స్, షార్ట్స్ చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఫ్రాన్స్ ప్రభుత్వం 15 ఏళ్లలోపు పిల్లలు సోషల్? మీడియాకు దూరంగా ఉండేలా నిషేధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. పిల్లలపై సోషల్ మీడియా దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. చాలా మంది బాలలు చదువుల కోసం, వినోదం కోసం సెల్?ఫోన్?లను వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో అధిక శాతం మంది ఇళ్లలో వైఫై సౌకర్యం కల్పించడంతో వీటి వినియోగం మరింత పెరుగుతోంది. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాస్?లతో స్మార్ట్?ఫోన్?లకు అలవాటైన విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే ఫోన్ పట్టుకునే ఉంటున్నారు.

తల్లిదండ్రులు హెచ్చరించినప్పటికీ పెడచెవిన పెడుతున్న ధోరణి క్రమంగా పెరుగుతోంది. ఎక్కువసేపు ఫోన్ వాడటం వల్ల శరీర ఒత్తిడి పెరుగుతుందని, ఇది క్రమరహిత హృదయ స్పందన రేటుకు దారితీస్తుందని, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధనలో తేలింది. ముఖ్యంగా "నోమోఫోబియా" వంటి పరిస్థితి – అంటే, ఫోన్ నుండి దూరంగా ఉన్నప్పుడు నాడీగా లేదా ఆందోళనగా అనిపించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. స్మార్ట్‌ఫోన్ నుండి వెలువడే నీలి కాంతి నిద్ర నాణ్యతను కూడా ప్రభావితం చేస్తుంది.

ఇది గుండె ఆరోగ్యానికి ముఖ్యమైనది. వేగవంతం చేయడం, రక్తపోటును పెంచడం, హృదయనాళ వ్యవస్థను ప్రభావితం చేయడం ప్రారంభిస్తుంది. మనస్సు పదే పదే ఒత్తిడికి గురైనప్పుడు, శరీరం పోరాటం లేదా పారిపోయే ప్రతిచర్య చురుకుగా మారుతుంది. ఇది హృదయ స్పందనను వేగవంతం చేస్తుంది.

నోమోఫోబియా అంటే నో మొబైల్ ఫోన్ ఫోబియా అనేది ఒక వ్యక్తి ఫోన్ లేకుండా భయం, విశ్రాంతి లేకపోవడం వంటి లక్షణాలను అనుభవించే పరిస్థితి. ఈ ఆందోళన నేరుగా మీ నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా, హృదయ స్పందన పెరుగుతుంది.

హృదయ స్పందన రేటు సక్రమంగా మారవచ్చు. ఈ పరిస్థితి చాలా కాలం పాటు కొనసాగితే, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. రోజుకు 5 గంటలకు పైగా స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వారిలో తక్కువ హృదయ స్పందన రేటు వేరియబిలిటీ ఉందని యూరోపియన్ అధ్యయనం వెల్లడించింది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రతికూల సంకేతం. అమెరికాలో కూడా జరిగిన కార్డియాలజీ సమావేశంలో నిపుణులు డిజిటల్ ఒత్తిడి కారణంగా గుండె జబ్బుల ప్రమాదం కొత్త తరంలో వేగంగా పెరుగుతోందని చెప్పారు. నిజానికి బ్రిటన్ కంటే ముందు భారత్‌లో పిల్లలు స్మార్ట్‌ఫోన్ల వాడడంపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరముంది. ఇందుకు తల్లిదండ్రుల ఆందోళనను, సూచనలను పరిగణలోకి తీసుకొని చట్టాన్ని రూపొందించాలి. స్మార్ట్‌ఫోన్ల వ్యసనం మన పిల్లల బాల్యాన్ని, మన సమాజ భద్రతను నాశనం చేయకముందే ప్రభుత్వాలు తక్షణమే స్పందించాల్సిన అవసరముంది.

సెల్?ఫోన్?కు బానిసలుగా మారే వారు ఎక్కువ మందితో అంతగా కలిసిపోలేరు. సోషల్ మీడియా ప్రపంచంలోనే ఉండేవారు నిజమైన లోకంలో జీవించలేరు.

పక్కనున్న రిలేటివ్స్, ఫ్రెండ్స్?ను కలవాలనే ఆసక్తి తగ్గిపోతుంది. ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడలేరు. భావాలను కూడా వ్యక్తం చేయలేరు. మానసిక ఎదుగుదల కూడా తగ్గిపోయేటువంటి అవకాశాలు ఉంటాయి' అని గోదావరిఖనికి చెందిన మానసిక వైద్య నిపుణులు రవివర్మ తెలిపారు.

# దసరా బాదుడు షురూ...

హైదరాబాద్, సెప్టెంబర్ 19, సరా పండుగకు సొంతూరు వెళ్దామనుకుంటున్నారా.. అయితే జేబులో డబ్బులు భారీగా పెట్టుకొండి. మీ దగ్గరున్న మొత్తంలో టికెట్ ధరకే అధికంగా ఖర్చు కానుంది. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు భారీ షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని.. టికెట్ ధరలను భారీగా పెంచేందుకు సిద్ధమయ్యింది. టికెట్ ధర మీద ఒకేసారి అదనంగా 50 శాతం పెంచనుంది. తెలంగాణలో దసరా పెద్ద పండుగ. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారు సైతం దసరా పండుగకు ఇంటికి చేరుకుంటారు. పండుగకు వారం రోజుల ముందు నుంచే ప్రయాణికుల రద్దీ మొదలవుతుంది. ఇక ఆదివారం అనగా సెప్టెంబర్ 21 నుంచి రాష్ట్రంలో విద్యా సంస్థలకు దసరా సెలవులు. దీంతో చాలా మంది సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడిపేందుకు రెడీ అయ్యింది. దీంతో పాటు పండగ రద్దీని క్యాష్ చేసుకునేందుకు కూడా ఆర్టీసీ సిద్ధమవుతోంది. దసరా పండుగ వేళ ప్రయాణికుల జేబుకు చిల్లు పెట్టేందుకు సిద్ధమైన ఆర్టీసీ బస్ టికెట్ ధర మీద 50 శాతం పెంచాలని నిర్ణయించింది. బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ బస్సుల్లో టికెట్ ఛార్జీ మీద 50 శాత అదనంగా వసూలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. దసరా పండుగ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ అనగా శనివారం నుంచి నుంచి అక్టోబరు 2 వరకు దాదాపు 13 రోజుల పాటు 7,754 అదనపు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ కార్యచరణ రూపొందించింది. సెప్టెంబర్ 20 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. వీటిల్లో మాత్రమే అదనపు ఛార్జీలను వసూలు చేస్తారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ వ్యాప్తంగా అలానే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు కూడా ఈ ప్రత్యేక బస్సులను నడపనుంది. దసరా సందర్భంగా పల్లెవెలుగు సహా అన్ని ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధర మీద 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసేందుకు ఆర్టీసీ రెడీ అయ్యింది. పండగ ముగిశాక తిరుగుప్రయాణాల కోసం అక్టోబరు 5, 6 తేదీలలో కూడా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణలో విద్యాసంస్థలకు ఈ నెల అనగా సెప్టెంబర్ 21 నుంచి దసరా సెలవులు ప్రారంభమవుతాయి. ఈక్రమంలో 20వ తేదీ అనగా శనివారం సాయంత్రం, 21న ఆదివారం నాడు ప్రయాణికుల రద్దీ భారీగా ఉంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. శని, ఆదివారం ఈ రెండు రోజుల్లోనే 1,079 ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. అలానే సెప్టెంబర్ 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా పండుగ ఉండటంతో రద్దీ విపరీతంగా ఉంటుందని ఆర్టీసీ భావిస్తోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 27 నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు ఆయా రోజుల్లో పెద్ద సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. ఛార్జీల పెంపు గురించి ఆర్టీసీ యాజమాన్యం మాట్లాడుతూ.. 'జీవో నం.16 ప్రకారం దసరా ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తాము. రిటర్న్‌లో చాలా వరకు బస్సులు ఖాళీగా రావాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈక్రమంలో బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధర మీద 50 శాతం అదనంగా వసూలు చేయనున్నాం. అయితే ఆయా రోజుల్లో తిరిగే రెగ్యులర్ సర్వీసుల ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు' అని ఆర్టీసీ తెలిపింది. హైదరాబాద్ సిటీలోని మెయిన్ బస్టాండ్లయిన ఎంజీబీఎస్, జేబీఎస్‌లతో పాటు.. ప్రయాణికుల సంఖ్య భారీగా ఉండే ఉప్పల్ బస్టాండ్, కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది.

పోయిన సంవత్సరం అనగా 2024 దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ 7,137 ప్రత్యేక బస్సులు నడపగా.. ఈ సంవత్సరం అంతకన్నా 617 ఎక్కువ బస్సులు నడపనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించింది.

# గ్రేటర్ లో వన మహోత్సవం సూపర్ సక్సెస్

**ప్రభుత్వ లక్ష్యం 25 లక్షలు... నాటిన మొక్కలు 25 లక్షల 31 వేలు**

**ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో 101 శాతం పూర్తి**




హైదరాబాద్, సెప్టెంబర్ 19, 2025:గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వన మహోత్సవం సూపర్ సక్సెస్ అయ్యింది.

గ్రేటర్ వ్యాప్తంగా 25 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రభుత్వం నిర్దేశించిన 25 లక్షలకు అదనంగా మరో 52,599 మొక్కలు నాటాలని మొత్తం ఈ సంవత్సరం 25 లక్షల 52 వేల 599 మొక్కలు నాటాలని జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఇప్పటికే జిహెచ్ఎంసి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 25 లక్షల 31 వేల 848 మొక్కలను నాటింది. ఈ ఏటా వర్షాకాల ప్రారంభంలో ఆశించినంత మేర వర్షాలు కురవకపోవడంతో కాస్త ఆలస్యంగా ప్రారంభమైన వన మహోత్సవం, ఆ తర్వాత గ్రేటర్ వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉధృతం చేశారు. చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మొక్కల ప్రాధాన్యతను వివరించారు



ప్రజా ప్రతినిధులు, ప్రజల్ని భాగస్వామ్యం చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఎప్పటికప్పుడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని సమీక్షిస్తూ వన మహోత్సవ లక్ష్యం వేగంగా పూర్తయ్యేలా క్షేత్ర అధికారుల సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

ఫలితంగా వేగంగా లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 25 లక్షలు మొక్కలు నాటే లక్ష్యంలో ప్రస్తుతం 101 శాతం లక్ష్యాన్నీ సాధించింది. జీహెచ్‌ఎంసీ మొత్తం లక్ష్యం 25 లక్షల 52 వేల 599 ( ప్రభుత్వం లక్ష్యం 25 లక్షలు %జూశ్రీబం% జీహెచ్‌ఎంసీ అదనపు లక్ష్యం 52,599) లలో 25 లక్షల 31 వేల మొక్కలు నాటి 99 శాతం లక్ష్యం పూర్తి చేసింది. నగరంలో పచ్చదనం పెంపుతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వాయు నాణ్యత పెరుగుతుంది.

# వరంగల్ కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

వరంగల్, సెప్టెంబర్ 19, వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ మొదలైంది. ఆధిపత్య పోరు మరోసారి బయటపడింది. భద్రకాళి అమ్మవారి ఆలయ పాలకమండలి ఏర్పాటు మంత్రి కొండా సురేఖకు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మధ్య అగ్గి రేపింది. అమ్మవారి ఆలయం పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉన్న క్రమంలో? అక్కడి కార్యకర్తలు పదవుల మీద ఆశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ అనుచరులు సైతం లైన్‌లోకి వచ్చారు. దీంతో? మొత్తం 16 మంది ఉన్న కమిటీలో ఏడుగురు సభ్యులను సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈస్ట్ నుంచి నియమించారు. ఇక నాయిని ప్రాతినిధ్యం వహిస్తున్న వెస్ట్ నుంచి ఐదుగురికే చోటు దక్కింది. మిగిన ఇద్దరిలో అమ్మవారి ఆలయం ప్రధాన పూజారి.. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు ఉంటారు. ఇదే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కోపం తెప్పించిందట. వాస్తవానికి ఆలయం ఉన్న వెస్ట్ నియోజకవర్గానికే ఏడు పదవులు ఇవ్వాలనుకున్నారట. అలా కాకుండా ఈస్ట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం, లోకల్ ఎమ్మెల్యేగా?. కనీసం తనను సంప్రదించకుండా మంత్రి కొండా సురేఖ కమిటీ సభ్యుల్ని ఎలా నియమిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారాయన. తాను ఏం చేసినా నడుస్తుందని కొండా అనుకుంటే కుదరదని కూడా ఫైరైపోయారాయన. దేవాదాయశాఖకు మంత్రి అయినంత మాత్రానా ఏదైనా చేయొచ్చా..? అని నిలదీశారు. అయితే? ఈ కామెంట్స్ మీద సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు కొండా సురేఖ. నాయిని రాజేందర్ రెడ్డి అదృష్టం కొద్దీ గెలిచిన ఎమ్మెల్యే అని అన్నారు. ఆయన గురించి కామెంట్ చేయడం అనవసరం అంటూనే? దేవాదాయశాఖ మంత్రిగా ఇద్దరికి పదవులు ఇచ్చే స్వేచ్ఛ నాకు లేదా అని ప్రశ్నించారు. వాళ్ళు పేర్లు ఇవ్వరు, ధర్మకర్తల మండలిని ఫైనల్ చేయనివ్వరు అని మండిపడ్డారు. అందుకు నాయిని కూడా తగ్గేదేలే అంటూ? ఎవరి పరిధిలో వారు వ్యవహరిస్తే మంచిదని మంత్రిని హెచ్చరించారు. నేను కూడా నాలుగు పార్టీలు మారి ఉంటే నాలుగు సార్లు ఎమ్మెల్యే అయ్యే వాడినేమోనంటూ సెటైర్లు వేశారు. మంత్రి హోదాలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని అందర్నీ కలుపుకొని వెళ్ళాలిగానీ? ఇలా గిల్లికజ్జాలు కరెక్ట్ కాదంటూ రియాక్ట్ అయ్యారు నాయిని. మంత్రి వైఖరి మీద పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పుకొచ్చారాయన. మొదట్నుంచి పార్టీలో ఉన్నవాళ్ళ మీద నాలుగు పార్టీలు తిరిగి వచ్చిన వాళ్ళ పెత్తనం ఏంటంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు ఎమ్మెల్యే. ఇక లాభం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరే ఈసారి విషయం తేల్చుకుంటానని రాజేందర్‌రెడ్డి తన అనుచరులతో అంటున్నట్టు తెలిసింది. అంతకు ముందు కూడా?. భద్రకాళి అమ్మవారికి బోనాల సమర్పణ ప్రతిపాదన విషయంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాయిని మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. వందల ఏళ్ళ నుంచి ఇక్కడ బోనాల సంప్రదాయం లేదని, అలాంటిది మంత్రి కొత్తగా ప్రతిపాదిస్తూ? సాంప్రదాయాన్ని మంటగలుపుతున్నారంటూ?ఎమ్మెల్యేతో పాటు ఆలయ పూజారులు, భక్తులు తీవ్రంగా వ్యతిరేకించడంతో సురేఖ వెనక్కి తగ్గారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నామినేటెడ్ పోస్టుల భర్తీ, పార్టీ పదవుల భర్తీ విషయంలో ఇరువర్గాల మధ్య పోరు కొనసాగుతూనే ఉంది. ఇక మంత్రి సురేఖ వ్యవహారశైలిపై అధికార పార్టీలోని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా ఫైరవుతున్నారు. ఈ గొడవపై ఇప్పటికే పంచాయితీ నడుస్తోంది. ఇది ఎప్పటికీ తెగని లొల్లిగా మారిపోవడంతో? పార్టీ కేడర్‌లో సైతం ఆందోళన వ్యక్తం అవుతోంది.

## అపార్ట్మెంట్ వాసులకు తెల్లవార్లు నిద్ర లేకుండా చేసిన అగంతకుడు

విజయవాడ రూరల్ జక్కంపూడి గ్రామ సమీపంలోని కేఎన్ అపార్ట్ మెంట్ లో ఒక ఆగంతకుడు అర్ధరాత్రి చొరబడ్డాడు. చెడ్డి వేసుకొని అనుమానాస్పదంగా దొంగతనానికి రావటం తో అపార్ట్మెంట్ వాసులు బెంబేలు ఎత్తారు. అగంతకుడిని పట్టుకొని టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం తెల్లవారి స్టేషన్ కు వెళ్ళి చూస్తే సదరు వ్యక్తి మాయం అయ్యాడు. దాంతో అపార్ట్మెంట్ వాసులు కంగుతున్నారు. ,అర్ధరాత్రి పోలీసులకు అగంతుకుడిని అప్పగించే సమయంలో ఆగంతకుడు వారిని బెదిరించాడు. దీంతో మళ్లీ తమ అపార్ట్మెంట్ వద్దకు వచ్చి దాడి చేస్తాడేమో అని భావించి అపార్ట్మెంట్ వాసులు కంగారుపడ్డారు. తిరిగి స్టేషన్ నుండి జక్కంపూడి వస్తున్న క్రమంలో అర్ధరాత్రి అపార్ట్మెంట్లో చోరీకి వచ్చిన అగంతకుడు తారసపడ్డాడు. వెంటనే అతనిని బంధించి టూ టౌన్ పోలీస్ స్టేషన్ను పోలీసులు పట్టించుకోకపోవడంతో సిపి ఆఫీస్ వద్దకు అపార్ట్మెంట్ వాసులు తీసుకుపోయారు. . అక్కడినుండి టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించి టూ టౌన్ కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనలను లైట్ గా తీసుకున్న టూ టౌన్ కొత్తపేట పోలీసులపై బాధితులు , ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణలో త్వరలోనే టూరిజం కాన్‌క్లేవ్

## పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యం

## ట్రావెల్ & టూరిజం ఫెయిర్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణలో అత్యున్నత స్థాయి టూరిజం కాన్‌క్లేవ్ ను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (HICC) లో జరిగిన ట్రావెల్ & టూరిజం ఫెయిర్ (TTF) 2025 ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇటీవల నూతన పర్యాటక విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. పర్యాటకం కేవలం వినోదం కాకుండా ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం కొత్త టూరిజం పాలసీ ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నది. వివిధ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ఇది విస్తృతమైన అవకాశాలను కల్పిస్తుంది. టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టండి. వారికి పూర్తిగా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు

ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, తెలంగాణలోనే త్వరలో ఒక ఉన్నత స్థాయి టూరిజం కాంక్లేవ్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం చర్చలకు, పెట్టుబడి ప్రణాళికలకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని వెల్లడించారు.

ప్రపంచస్థాయి పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని వనరులు తెలంగాణలో ఉన్నాయని, అయితే తెలంగాణ పర్యాటకానికి అనుకున్న స్థాయిలోప్రచారం లభించడకపోవడమే అసలైన లోటన్నారు. మీరు మా రాష్ట్రాన్ని అన్వేషించేటప్పుడు, మా పర్యాటక అవకాశాలను ప్యాకేజ్ చేయటంలో భాగస్వాములు కావాలని, తెలంగాణకు బ్రాండ్ అంబాసడర్లుగా నిలవాలని టూరిజం, ట్రావెల్స్, హస్పిటాలిటీ ఎగ్జిబిటర్లు, ప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతాయని, బతుకమ్మ వేడుకలను చారిత్రక వేయి స్తంబాల గుడి వద్ద ప్రారంభిస్తున్నామని, ఈ పూల పండుగను ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఆస్వాదించి, దాని వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలి కోరారు.

# లోకల్ పోరు ఇంతింతకాదయా

హైద్రాబాద్, సెప్టెంబర్ 19, ఇప్పుడు బిహార్ ఎన్నికల వేడి తెలంగాణకు తాకుతోంది. దీంతో రేవంత్ సర్కార్..లోకల్ పోరుకు వెళ్లేందుకు జంకుతుందట. కారణం బీసీ కోటా. ఈ అంశం ఇప్పుడు నేషనల్ ఎజెండా అయిపోయింది. తెలంగాణలో ఆల్రెడీ బీసీ రిజర్వేషన్లు ఇంప్లిమెంట్ చేశామని చెప్పుకునేందుకు రెడీ అయింది కాంగ్రెస్. కానీ ఇక్కడ సీన్ రివర్స్‌లో ఉంది. రాష్ట్రప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉంది. గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్ ఆగిపోయింది.ఇక బీసీ రిజర్వేషన్లపై రేవంత్ సర్కార్ జీవో జారీ చేసేందుకు రెడీ అవుతోందన్న లీకులు బయటికి వచ్చాయి. కానీ స్థానిక పోరు అంటేనే కాంగ్రెస్ వణికిపోతుందట. ఓవైపు యూరియా కష్టాల..ఇంకోవైపు వానలు, వరదలు, సర్కార్ హామీలు..అన్నీ కాంగ్రెస్‌ను కలవరపెడుతున్నాయి. ఇవన్నీ ఇంటర్నల్ విషయాలే అయినా..నేషనల్ ఇష్యూగా కాంగ్రెస్‌ను కలవరపెడుతున్న అంశం బీసీ రిజర్వేషన్లు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఏ ప్రయత్నాలు సక్సెస్ కాకపోవడంతో.. అటు రాష్ట్రపతి, ఇటు గవర్నర్ ఇద్దరి దగ్గర పెండింగ్ లిస్ట్‌లో ఉండిపోయింది బీసీ రిజర్వేషన్ల అంశం. ఇది ఇలా ఉంటే.. సెప్టెంబర్ 30 లోపు లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్ట్ డెడ్ లైన్ పెట్టింది. కానీ అంతలోపే ఎన్నికలకు వెళ్దామంటే..బిహార్ ఎన్నికలు కాంగ్రెస్‌కు గుబులు పుట్టిస్తున్నాయట.రాష్ట్రపతి దగ్గర బిల్లు, గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్ పెండింగ్‌లో ఉంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ పాస్ చేసిన బిల్లు కూడా పెండింగ్‌లోనే ఉండిపోయింది. పోనీ జీవో ద్వారా బీసీ రిజర్వేషన్లు ఇద్దామంటే కోర్టుల్లో నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. అలా అని బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుండా లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిద్దామనుకుంటే బిహార్ ఎన్నికలు కాంగ్రెస్‌కు సవాల్ మారాయి. అక్కడ కూడా?బీసీలకు 42 శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్న ఒత్తిడి కాంగ్రెస్‌పై వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘడ్‌బంధన్..ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ అలయన్స్‌కు బీసీ రిజర్వేషన్లు సవాల్‌గా మారే అవకాశం ఉంది.ఇప్పటికే..బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్ అంశంపై..తెలంగాణ మోడల్‌గా కాంగ్రెస్ జాతీయ స్థాయిలో ప్రచారం చేసింది. ఈ అంశంపై బీసీలను అట్రాక్ట్ చేయడంలో కాంగ్రెస్ కొంత సక్సెస్ అయ్యింది. దీంతో మోదీ సర్కార్ కూడా వచ్చే జనగణనలో..కులగణన చేస్తామంటూ ప్రకటించింది. ఈ సమయంలో ఇక్కడ పార్టీ ద్వారా బీసీలకు టికెట్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తే..బిహార్‌లో కూడా..ఇదే అంశం..కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలకు ఆయుధంగా మారే అవకాశం ఉంది.ఇది సొంత కూటమిలో కూడా..బీసీ నేతల అసంతృప్తి దారి తీయొచ్చు. దీంతో బిహార్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయిందట కాంగ్రెస్ పార్టీ. అందుకోసం హైకోర్టును మూడు నెలల గడువు కోరేందుకు ఇప్పటికే అన్ని అస్త్రాలను సిద్ధం చేసి పెట్టుకుందట. పైకి బీసీ రిజర్వేషన్ల ఇద్దామంటే అడ్డంకులు ఉన్నాయని చెప్తున్నా..బిహార్ ఎన్నికలే కాంగ్రెస్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయట. మరి బిహార్ ఎలక్షన్స్ తర్వాతైనా కాంగ్రెస్ సర్కార్ లోకల్ బాడీ పోల్స్ నిర్వహిస్తుందో ఇంకా టైమ్ తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

# కేసీఆర్ చాణుక్య వ్యూహం



హైదరాబాద్, సెప్టెంబర్ 19, తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఒక అపార చాణక్యుడిలా గుర్తింపు పొందాడు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రజలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రెండేళ్లు పూర్తి అవుతున్న తరుణంలో కేసీఆర్ మళ్లీ యాక్టీవ్ అవుతున్నారు. ప్రజల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ బలహీనతలను ఉపయోగించి పార్టీని బలోపేతం, పునర్నిర్మించడంపై దృష్టి పెట్టారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారంలోకి వచ్చే వ్యూహం రూపొందిస్తున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో పెరిగిన అసంతృప్తి, ఇరిగేషన్ సమస్యలు, ఆర్థిక సంక్షోభాలు ? ఇవన్నీ కేసీఆర్ దీర్ఘకాలిక ఆలోచనలో భాగమే.2023 ఎన్నికల ఓటమి తర్వాత, కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోకి వెళ్లిపోయారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యలు లేదా డిమోరలైజేషన్ కాదు ? ఇది ఒక ఆచరణాత్మక మౌనం. రేవంత్ రెడ్డి 'స్వయం నిర్బంధన' అని ఎగతాళి చేసినప్పటికీ, ఈ దూరం వారికి ప్రభుత్వ చర్యలను దగ్గరగా పరిశీలించే అవకాశాన్ని ఇచ్చింది. ఫలితంగా, కాంగ్రెస్ పాలనలోని లోపాలు ? రైతుల రుణమాఫీలో ఆలస్యం, రైతు బంధు చెల్లింపుల ఆలస్యం, హైడ్రా ద్వారా రియల్ ఎస్టేట్‌లో క్షీణత ? ఇవన్నీ బీఆర్ఎస్‌కు ఆయుధాలుగా మారాయి. ఈ మౌనం, పార్టీ క్యాడర్‌లో ఆందోళన కలిగించినప్పటికీ, కేసీఆర్‌కు 'తెలంగాణ బాపూ' ఇమేజ్‌ను పునరుద్ధరించే సమయాన్ని ఇచ్చింది. ఇటీవలి పోల్స్‌లో కూడా, ప్రజలు కేసీఆర్‌ను 'ఫామ్‌హౌస్' కంటే 'పబ్లిక్ గవర్నెన్స్'కు ప్రిఫర్ చేశారు, ఇది కాంగ్రెస్ స్వయం?పోల్‌లో కూడా స్పష్టంగా కనిపించింది.బీఆర్ఎస్ పునరుద్ధరణకు కేసీఆర్ రూపొందించిన ప్లాన్, గ్రాస్‌రూట్ స్థాయిలో ప్రారంభమై, రాష్ట్రవ్యాప్త చర్చలతో ముగుస్తోంది. 2025 ఫిబ్రవరిలో పార్టీ సిల్వర్ జూబిలీ జరుపుతూ, వారు మెంబర్‌షిప్ డ్రైవ్‌ను ప్రారంభించారు, ఇది కేవలం సంఖ్యలు పెంచడం కాదు ? ప్రజల అసంతృప్తిని రాజకీయ ఊపందుకునేందుకు ఉద్దేశించినది. రైతు ఆత్మహత్యలు, ఆటో డ్రైవర్ల సమస్యలు, విద్యార్థుల అభ్యంతరాలు ? ఇవి పార్టీ సమావేశాల్లో చర్చనీయాంశాలుగా మారాయి. కేసీఆర్, 'కాంగ్రెస్ పాలనలో ప్రజలు బాధపడుతున్నారు, మేము వారి పక్షంలో నిలుస్తాం' అని ప్రకటించారు. కేటీఆర్, 'మా తండ్రి సరైన సమయంలో రావడం తెలుసు' అని చెప్పడం, వారి కుటుంబ వ్యూహాన్ని సూచిస్తుంది ? కేసీఆర్ లీడర్‌షిప్‌లో, కేటీఆర్ యువతను టార్గెట్ చేస్తూ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఇటీవలి డెఫెక్షన్లు (ఎమ్ఎల్ఏలు కాంగ్రెస్‌లోకి వెళ్లడం) కూడా బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారవచ్చు ? బై?ఎలక్షన్లు జరిగితే, ప్రజలు 'కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్' మధ్య ఎంపిక చేస్తారని కేటీఆర్ ఛాలెంజ్ చేశారు.కేసీఆర్ వ్యూహంలో కీలకం, కాంగ్రెస్ పాలనలోని లోపాలను హైలైట్ చేయడం. 420 ప్రామిస్‌లలో చాలా ఇంకా అమలు కాలేదు ? రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు అసంతృప్తితో ముందుకు వస్తున్నారు. కలేశ్వరం ప్రాజెక్ట్ పంపులు ఆఫ్ చేయడం, యూరియా కొరత వంటి సమస్యలను ఎత్తి చూపారు. ఇది మాత్రమే కాదు, బీజేపీతో 'టాకిట్ అండర్‌స్టాండింగ్' ఆరోపణలను ఎదుర్కొని, వారిని 'అంటీ?తెలంగాణ'గా చిత్రీకరిస్తున్నారు. ఫలితంగా, అంటీ?ఇంకంబెన్సీ పెరుగుతోంది ? రియల్ ఎస్టేట్ క్షీణత, కన్‌స్ట్రక్షన్ ఆగిపోవడం వంటివి ప్రజల్లో కోపాన్ని మరింత పెంచుతున్నాయి. కేసీఆర్ ఈ అసంతృప్తిని ప్రజా ఉద్యమంగా మలిచి, 2026?28 మధ్య తిరిగి రావడానికి సిద్ధమవుతున్నారు.

# హైదరాబాద్ ఫోటో ట్రేడ్ ఎక్స్ పో 2025 ఘనంగా ప్రారంభం.

తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఎక్స్ పో ను రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి గారు మాట్లాడుతూ %-

ఫోటో మరియు వీడియోగ్రాఫర్స్ సమాజంలో విశేషమైన పాత్ర పోషిస్తున్నారని, ప్రతి వేడుకను, ప్రతి చరిత్రను భవిష్యత్తు తరాలకు నిలుపుదల చేసే ముఖ్య వృత్తి ఇదని అన్నారు.

ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియోగ్రాఫర్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఇలాంటి ఎక్స్ పోల ద్వారా కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడం వృత్తి అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం మాత్రమే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా పాల్గొనడం ఈ ఎక్స్ పో కు ప్రత్యేకతని అన్నారు.

ఈ కార్యక్రమంలో 200 పైగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయబడి, ఫోటో మరియు వీడియో రంగానికి సంబంధించిన కెమెరాలు, లైటింగ్, డ్రోన్స్, సాఫ్ట్‌వేర్స్, ప్రింటింగ్ టెక్నాలజీ వంటి విభిన్న ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్ పోలో వేలాది మంది ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ పాల్గొననున్నారు.

## వర్షాకాలంలో కూడా నీరు కొనుగోలు

## – భావి తరాలకు ప్రమాదం అంటున్న "ఈపీడీసీ.

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (:పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వమే ముందుకు రావాలని, రీచార్జ్ గుంతలు నిర్మించని, పచ్చదనం ఏర్పాటు చేయని బిల్డర్లపై భారీ జరిమానాలు విధించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ)వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో వర్షాకాలం మధ్యలో కూడా అపార్ట్మెంట్ల వాసులు నీరు కొనుగోలు చేస్తున్న దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. నీటి కొరతపై శుక్రవారం రంగయ్య మాట్లాడుతూ..., "పట్టణ వృద్ధిలో ప్రాథమికంగా దృష్టి పెట్టాల్సింది నీటి భద్రత. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షపు నీరు భూమిలోకి వెళ్లకుండా వృథా అవుతోంది. రానున్న రోజుల్లో ఇది తీవ్రమైన సమస్యగా మారుతుంది" అని హెచ్చరించారు. హైదరాబాద్‌లో కొత్తగా నిర్మితమవుతున్న అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఇంకా రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేయకపోవడమే కాక పచ్చదనం కోసం కూడా స్థలం కేటాయించడం లేదు. ఇవన్నీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటిస్తున్న రేవంత్ సర్కార్ తక్షణమే క్షేత్ర స్థాయిలో తనిఖీలు జరపాల్సి ఉందని రంగయ్య సూచించారు.

# సిద్ధిపేటకు బై పాస్...

మెదక్, సెప్టెంబర్ 19, మెదక్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య అనేది రోజురోజుకూ పెరిగిపోతోంది. రెండు జాతీయ రహదారులు పట్టణం గుండా వెళ్తుండటం.. బైపాస్ రోడ్డు లేకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీని కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా.. ప్రమాదాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జిల్లా వాసులకు శుభవార్త చెప్పింది. బైపాస్ రహదారి నిర్మాణం కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు బిడ్లు ఆహ్వానించింది. దీంతో త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.మెదక్ పట్టణం గుండా రెండు జాతీయ రహదారులు (నేషనల్ హైవేలు) దూసుకుపోతున్నప్పటికీ.. ఇప్పటికీ బైపాస్ లేకపోవడం స్థానికులకు, వాహనదారులకు పెద్ద సవాల్‌గా మారింది. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఒకే దారిని వాడుతుండటంతో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగింది. దీనితో పాటు ప్రమాదాలు పెరిగి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.బైపాస్ రహదారి అవసరాన్ని గుర్తించి... ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసేందుకు బిడ్లు ఆహ్వానించింది. ఇది అమల్లోకి వస్తే.. నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, వాహనదారుల ప్రయాణం సులభమవుతుంది. మెదక్ పట్టణానికి బైపాస్ అవసరం కొత్త విషయం కాదు. 15 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినప్పటికీ.. ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదు. 2014లో సర్వే చేసినా.. పనులు ముందుకు జరగలేదు.ప్రస్తుతం గండిమైసమ్మ నుంచి మెదక్ వరకు 765డి నేషనల్ హైవే పూర్తయింది. మెదక్ మీదుగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి వరకు పనులు జరుగుతున్నాయి. అయితే సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల శివారు నుంచి కొల్చారం వరకు అటవీప్రాంతం కారణంగా విస్తరణ ఆగిపోయింది. ఈ నేపథ్యంలోనే బైపాస్ నిర్మాణం అవసరమని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ డీపీఆర్ ద్వారా తేల్చనుంది. మక్తభూపతిపూర్ నుంచి నర్సిఖేడ్ శివారు మీదుగా తీన్ నంబర్ చౌరస్తా వరకు పూర్వం ప్రతిపాదించిన మార్గాన్నే తీసుకుంటారా, లేక కొత్త మార్గాన్ని ఎంచుకుంటారా అన్నది నివేదికలో స్పష్టమవుతుంది.మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత.. రాకపోకలు మరింత పెరిగాయి. సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ దిశగా వెళ్లే వాహనాలు అన్నీ ఒకే రహదారిపై నడుస్తుండటంతో రద్దీ తగ్గించడం కష్టంగా మారింది. రాందాస్ చౌరస్తా మీదుగా వాహనాల రద్దీ ఎక్కువ కావడం వల్ల ఎప్పటికప్పుడు సిగ్నల్ ట్రాఫిక్ ఆగిపోతోంది. అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాదాలు లేదా వాహనాలు చెడిపోతే ట్రాఫిక్ పూర్తిగా స్తంభిస్తోంది.మెదక్ పట్టణ జనాభా 70 వేలకుపైగా ఉంది. రోజుకు సుమారు 10 వేల వాహనాలు పట్టణంలోనుండి ప్రయాణిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బైపాస్ రహదారి నిర్మాణం అత్యవసరమని ప్రజలు భావిస్తున్నారు. బై పాస్ రోడ్డు త్వరగా పూర్తి అయితే.. స్థానికులకు ఊరట లభించడంతో పాటు వాణిజ్య, రవాణా రంగాలకు ఊతమివ్వనుంది.

# లేని రోగం ఉందని తప్పులు నివేదిక ఆస్పత్రిపై కేసు

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ఇటీవలి కాలంలో ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రజల్లో భయం పెరుగుతోంది. కర్ఖానాలోని సౌమ్య ఆసుపత్రి వైద్యులు ఒక మహిళకు రొమ్ము క్యాన్సర్ లేనప్పటికీ తప్పుడు నివేదిక ఇచ్చిన ఘటన చర్చనీయాంశమైంది. ల్యాబ్ రిపోర్టులు, డయాగ్నస్టిక్ ఫలితాలను తారుమారు చేసి రోగులను మోసం చేస్తున్నట్టు ఆరోపణలు రావడం కొత్త కాదు. ప్రతి జిల్లా డీఎంహెచ్ఓ తనిఖీలు లేకపోవడం, నియంత్రణ లోపించడం వల్ల ఇలాంటి దుర్వినియోగాలు పెరుగుతున్నాయి. అయితే ల్యాబ్ రిపోర్ట్స్ పై అనుమానం ఉంటే.. రెండో అభిప్రాయం తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు.ఆరోగ్యం కాపాడుకోవడానికే ప్రజలు ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. కానీ.. నేటి వాస్తవం మాత్రం భిన్నంగా ఉంది.

ఆసుపత్రి తలుపు తట్టాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు వైద్యుడు అంటే విశ్వాసానికి ప్రతీకగా భావించేవారు. కానీ ఇప్పుడు ఏ డాక్టర్‌ను విశ్వసించాలో.. ఏ ల్యాబ్ నివేదికను నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొంది. తాజాగా ఓ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్ కర్ఖానాలోని సౌమ్య ఆసుపత్రిలో చోటు చేసుకున్న సంఘటన ఈ భయాన్ని మరింత పెంచింది.ఒక మహిళకు రొమ్ము క్యాన్సర్ ఉందని తప్పుడు నివేదిక ఇవ్వడం ద్వారా.. ఆమెను అనవసరంగా చికిత్సలు చేయించుకునేలా మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది.

వాస్తవానికి ఆ మహిళకు అలాంటి వ్యాధి లేకపోయినా.. భయం సృష్టించి డబ్బు లాగేయడం లక్ష్యంగా చేసుకున్నారు. ఈ మోసం బయటపడటంతో ప్రజలలో ఉన్న అనుమానాలు మరింతగా పెరిగాయి.2022లో ఓ మహిళ తన ఎడమ రొమ్ములోని చిన్న ట్యూమర్‌కు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ సమయంలో పరీక్షలు, నివేదికలు ఆ గడ్డ క్యాన్సర్ కాదని నిర్ధారించాయి. కేవలం సాధారణ చెక్ అప్స్‌కు మాత్రమే రావాలని వైద్యులు సూచించారు. అయితే.. 2024 సెప్టెంబర్‌లో ఆమె చెకప్‌కు వెళ్లినప్పుడు.. వైద్యులు ఆమె అనుమతి లేకుండా ఎడమ రొమ్ముకు బదులుగా కుడి రొమ్ముపై బయాప్సీ చేశారని ఆరోపించారు.ఈ క్రమంలో.. అక్టోబర్ 3, 2024న జారీ అయిన బయాప్సీ రిపోర్టులో ఆమె వయసు 54 ఏళ్ల స్థానంలో 74 ఏళ్లుగా తప్పుగా నమోదు చేశారు. అక్టోబర్ 10న వచ్చిన మరో రిపోర్టులో ఆమెకు గతంలో క్యాన్సర్ చరిత్ర ఉందని తప్పుడు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేయగా.. వైద్యులు పెన్‌తో ఆ తప్పును సరిచేశారు. వైద్యులు ఇచ్చిన తప్పుడు నివేదికలను నమ్మి.. ఆమె వెంటనే శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత ఆమెకు అనుమానం రావడంతో.. బయాప్సీ స్లైడ్లు, టిష్యూ బ్లాక్‌ను స్వతంత్రంగా పరీక్ష చేయించారు. ఎయిమ్స్ బిబినగర్‌కు చెందిన డా. మహేంద్ర పరగే ఇచ్చిన నివేదికలో బయాప్సీ స్లైడ్, టిష్యూ బ్లాక్ మధ్య పొంతన లేదని.. అవి మార్చబడ్డాయని స్పష్టమైంది.ఆసుపత్రి సిబ్బంది ల్యాబ్ రిపోర్ట్‌లను తారుమారు చేసి.. తప్పుడు క్యాన్సర్ నిర్ధారణతో శస్త్రచికిత్స చేశారని ఆమె ఆరోపించారు. దీనివల్ల రూ.1,00,000 ఖర్చు చేశానని.. అంతే కాకుండా.. శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలను చవిచూశారని పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా.. పోలీసులు ఆసుపత్రి వైద్యులపై భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.ఇలాంటి ఘటనలు కొత్తవేమి కావు. అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ రిపోర్టులు తారుమారు చేయడం, అవసరం లేని పరీక్షలు చేయించడం, రోగులను భయపెట్టడం వంటి చర్యలు సాధారణమైపోయాయి. ల్యాబ్‌లు, ఫార్మసీలు, ఆసుపత్రులు కలిసి ఒక మాఫియాగా మారి ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నాయి. రోగి ఆరోగ్యం కన్నా వసూళ్లే ముఖ్యమని అనిపించే విధంగా ప్రవర్తిస్తున్నారు.

ఈ పరిస్థితి సినీ సన్నివేశాలను గుర్తు చేస్తోంది. చిరంజీవి నటించిన ఠాగూర్ చిత్రంలో ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా ఆసుపత్రి డాక్టర్స్ అతనికి చికిత్స చేసినట్లు నటించి, చివరికి చనిపోయాడని ప్రకటించి డబ్బు వసూలు చేసే సన్నివేశం ఉంది. ఆ సీన్ అప్పట్లో అతిశయోక్తిగా అనిపించినా.. ఇప్పుడు అది నిత్యజీవితంలో నిజమవుతోందనే అనిపిస్తోంది.ప్రతి జిల్లా పరిధిలో ఆసుపత్రుల తనిఖీలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్ జిల్లాలో 15 క్లస్టర్లు ఉన్నప్పటికీ.. పర్యవేక్షణ సరిగ్గా జరగకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి. వైద్యులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ రకమైన మోసాలు ఆగడం లేదు.

నిపుణులు చెబుతున్నట్లుగా.. ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మసీలు, ల్యాబ్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ సంస్థ ఏర్పాటు చేయకపోతే ఈ మాఫియాను ఆపడం అసాధ్యం. అక్రమ ల్యాబ్‌లు, నకిలీ రిపోర్టులు, ఫార్మసీ కాంట్రాక్టర్లను అరికట్టడానికి ప్రభుత్వం కొత్త బృందాలను ఏర్పాటు చేసి, తప్పు చేసిన వారికి కఠిన శిక్షలు విధించాలి.ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మీరు పరీక్షలు చేయించుకున్న తర్వాత వాటిపై మీకు ఏదైనా అనుమానం వస్తే.. రెండవ అభిప్రాయానికి వెళ్లడం ఎంతైన సురక్షితం. దీనికి ఒక ఉదాహరణ.. హైదరాబాద్‌లో ఓ తండ్రి తన కుమార్తె కంటి పరీక్ష కోసం మొదట ఒక ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ రిపోర్ట్స్ పై అనుమానం రావడంతో మరో ఆసుపత్రికి వెళ్లాడు.. అక్కడ నుంచి మరో ఆసుపత్రికి ఇలా మొత్తం మూడు ఆసుపత్రులకు వెళ్లగా.. మూడు రిపోర్ట్‌లు కూడా వేర్వేరుగా రావడం విశేషం.వ్యవస్థలో ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది ఈ ఘటన. ఇలా ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్న వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే.. అది సమాజానికే ప్రమాదం. నిజాయితీగా సేవలు అందించే వైద్యులు ఉన్నప్పటికీ.. కొంతమంది దురాశతో మొత్తం వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నారు.

ఆసుపత్రులు వాణిజ్య కేంద్రాలుగా మారకూడదు. ప్రభుత్వం పర్యవేక్షణ కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది.

# సిటీలో మరో స్కైవాక్...

హైదరాబాద్ సెప్టెంబర్ 19, హైదరాబాద్ నగరంలో పాదచారుల భద్రత, రవాణా సౌలభ్యం కోసం మరిన్ని స్కైవాక్‌లను నిర్మించడానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ఉప్పల్‌లో స్కైవాక్ అందుబాటులోకి రాగా.. మెహిదీపట్నం స్కైవాక్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇదే స్ఫూర్తితో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోనూ కొత్త ప్రాజెక్టులకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టబోతోంది.హైదరాబాద్ నగరంలో తొలిసారిగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఉప్పల్ రింగ్‌రోడ్ వద్ద అత్యాధునిక స్కైవాక్‌ను నిర్మించారు. 660 మీటర్ల పొడవుతో, రూ.25 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ స్కైవాక్ పాదచారులకు రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, సాయంత్రం వేళల్లో ప్రజల సందర్శనా కేంద్రంగా కూడా మారింది. ఉప్పల్ స్కైవాక్ సక్సెస్ కావటంతో.. హెచ్ఎండీఏ మెహిదీపట్నంలో 380 మీటర్ల పొడవైన స్కైవాక్‌ను రూ.34.86 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. డిఫెన్స్ భూముల సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ కొంత ఆలస్యమైనప్పటికీ.. దాని నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మెహిదీపట్నంలో రోజూ లక్షలాది మంది ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు రద్దీగా ఉంటారు. ఈ స్కైవాక్ అందుబాటులోకి వస్తే పాదచారుల ఇబ్బందులు తొలగి, వారికి సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుంది.నగరంలో అత్యంత రద్దీగా ఉండే కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్ వద్ద పాదచారుల ఇబ్బందులను గమనించిన హెచ్ఎండీఏ.. ఇక్కడ కూడా స్కైవాక్‌ను నిర్మించాలని నిర్ణయించింది. ఈ కొత్త స్కైవాక్ జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ నుంచి లులు మాల్ వరకు సుమారు 600 మీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పీపీపీ పద్ధతిలో చేపట్టాలా లేక నేరుగా హెచ్ఎండీఏ ద్వారానే నిర్మించాలా అనే విషయాలపై అధికారులు ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ను సిద్ధం చేసి, నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.హైదరాబాద్‌లో ఉన్న మరో కీలకమైన రవాణా కేంద్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్. ఇక్కడ కూడా భారీ స్కైవాక్‌ను నిర్మించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయితే హైదరాబాద్‌లో పాదచారుల భద్రత గణనీయంగా మెరుగుపడుతుంది. ఈ స్కైవాక్‌లు కేవలం రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, నగర జీవనంలో అంతర్భాగంగా నిలిచిపోతాయి.

# రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర భూపాలపల్లి ప్రజాబలం ప్రతినిధి:**రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు.

శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, అసైన్డ్ భూముల విచారణ, భూ భారతి, 22-ఏ తదితర కీలక అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.

మండలాల వారీగా దరఖాస్తుల స్థితిని తెలుసుకున్న కలెక్టర్ దరఖాస్తుల విచారణను వేగవంతం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలంటే అధికారులు వచ్చిన దరఖాస్తులు ఆదారంగా క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ రికార్డుల ప్రామాణికతను నిర్ధారిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో కూడా నీరు కొనుగోలు
## - భూగర్భ జలం అడగంటుతోంది.
## బిఇంకుడు గుంతల లెక్కలు తేల్చాలి
## - భావి తరాలకు ప్రమాదం అంటున్న "ఈపీడీసీ.



**హైదరాబాద్ సెప్టెంబర్ 19 ప్రజాబలం ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వమే ముందుకు రావాలని, రీచార్జ్ గుంతలు నిర్మించని, పచ్చదనం ఏర్పాటు చేయని బిల్డర్లపై భారీ జరిమానాలు విధించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ)వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో వర్షాకాలం మధ్యలో కూడా అపార్ట్మెంట్ల వాసులు నీరు కొనుగోలు చేస్తున్న దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. నీటి కొరతపై శుక్రవారం రంగయ్య మాట్లాడుతూ..., "పట్టణ వృద్ధిలో ప్రాథమికంగా దృష్టి పెట్టాల్సింది నీటి భద్రత. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షపు నీరు భూమిలోకి వెళ్లకుండా వృథా అవుతోంది. రానున్న రోజుల్లో ఇది తీవ్రమైన సమస్యగా మారుతుంది" అని హెచ్చరించారు. హైదరాబాద్లో కొత్తగా నిర్మితమవుతున్న అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఇంకా రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేయకపోవడమే కాక పచ్చదనం కోసం కూడా స్థలం కేటాయించడం లేదు. ఇవన్నీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటిస్తున్న రేవంత్ సర్కార్ తక్షణమే క్షేత్ర స్థాయిలో తనిఖీలు జరపాల్సి ఉందని రంగయ్య సూచించారు. ప్రతి నిర్మాణం, ప్రతి ఇంటిలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించి, ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నీరు కొనుగోలు చేస్తున్న పరిస్థితి చూస్తే రానున్న రోజుల్లో సమస్య మరింత పెరిగి, పౌరజీవితం గందరగోళంలో పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పచ్చదనం లేకపోవడం, వర్షపు నీరు భూమిలోకి దిగే మార్గాలు లేకపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని స్పష్టం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే ఈపీడీసీ న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు రంగయ్య హెచ్చరించారు.

## మద్యం దుకాణాల రిజర్వేషన్ పెంచి గీత సొసైటీలకే కేటాయించాలి
## కల్లు గీత వారికి రాష్ట్ర సొసైటీ వెంటనే ఏర్పాటు చేయాలి
## తాటి సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకువచ్చి జాతీయ సబ్సిడీలు కల్పించాలి
## గీత కార్మికుల హక్కుల కోసం గళమెత్తిన డా. బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్ సెప్టెంబర్ 19 ప్రజాబలం ప్రతినిధి:**గీత కార్మికుల హక్కుల కోసం బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, భువనగిరి మాజీ ఎంపీ డా.బూర నర్సయ్య గౌడ్ గళమెత్తరు.ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్లో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిసి, కల్లు గీత కార్మికులకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ 20 నెలలు గడిచినా కార్మికులు నిరీక్షణలోనే ఉన్నారని, హామీలు నెరవేర్చకపోవడం సమాజానికి అన్యాయ మని పేర్కొన్నారు. మద్యం దుకాణాల రిజర్వేషన్ పెంచి గీత సొసైటీలకే కేటాయించాలని,. కల్లు గీత వారికి రాష్ట్ర సొసైటీ వెంటనే ఏర్పాటు చేయాలని,. ఎక్స్గ్రేషియా బకాయిలను చెల్లించి, మొత్తాన్ని రు.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు.. అలాగే తాటి సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకువచ్చి జాతీయ సబ్సిడీలు కల్పించాలని,. %×జూ=% ఆమోదించిన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తాటి హైబ్రిడ్ రకాలపై పరిశోధన చేపట్టాలని,.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు తెలిపారు

# సురప్రకసం తుడా లేఔట్ కు ప్రజల నుంచి విశేష స్పందన..
## తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..

తిరుపతి రేణిగుంట హైవే పద్మావతి నగర్ లోని సురప్రకసం తుడా లేఔట్ ఈ వేలంకు ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అయన మీడియతో మాట్లాడారు.సురప్రకాశంలోని మొత్తం 277 ఫ్లాట్లకు ఈ నెల4 వ తేదీ నుంచి 17 వా తేదీ వరకు 13వ విడత ఈ వేలం నిర్వహించామన్నారు. ప్రజలనుంచి అనూహ్య స్పందన రావడంతో ఈ వేళలను ఈనెల 24 వరకు పొడిగించడం జరిగిందని పేర్కొన్నారు. గతలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటివరకు 105 ఫ్లాట్లు అమ్మకం జరగగా సుమారు 39 కోట్ల రూపాయలు తుడాకు ఆదాయం లభించిందని తెలియజేసారు. పొడిగించిన సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుడా పై నమ్మకం ఉంచి తుడా లేఔట్స్ లో ఫ్లాట్స్ కొనుగోలు చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# తల్లి భాగాలేకపోతే పిల్లలు బాగుండరు..
# పిల్లలు బాగుండకపోతే దేశం బాగుండదు

### తల్లి ఆరోగ్యం కోసం నరేంద్ర మోడీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు
### దానిని కూడా ప్రజల్లోకి తీసుకొని వెళ్తున్నాం.
### ప్రజలు పెద్ద ఎత్తున సహకరించాలని విజ్ఞప్తి
### మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్



**ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్ సెప్టెంబర్ 19 తల్లి భాగాలేకపోతే పిల్లలు బాగుండరు.. పిల్లలు బాగుండకపోతే దేశం బాగుండదు తల్లి ఆరోగ్యం కోసం నరేంద్ర మోడీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారని, దానిని ప్రజల్లోకి తీసుకొని వెళ్తున్నామని అందుకు ప్రజలు పెద్ద ఎత్తున సహకరించాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేసారు.మేడ్చల్ అర్బన్ జిల్లా ఆధ్వర్యం లో ఉచిత రక్త దాన శిబిర%శీ% ఉచిత కంటి చికిత్స మరియు దంత చికత్స కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో సెప్టెంబర్ 17 నుండి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాము. భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి..జై కిసాన్ జై జవాన్ నినాదం ఇచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి గారి,భారత జాతిపిత మహాత్మా గాంధీ గారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు 15 రోజులపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు..ప్రజలు వందల సంఖ్యలో రక్తదానం చేస్తున్నారు. తలసిమియా, సికెల్ సెల్ జబ్బులతో బాధపడే వారికి, ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం అయిన వారికి రక్తం అందించడానికి గౌరవ కార్పొరేటర్లు బిజెపి నేతలు ఈ కార్యక్రమాన్నిచేపట్టామన్నారు.. ఈ కార్యక్రమాలు గౌరవ కార్పొరేటర్లు బిజెపి నేతలు నిర్వహిస్తున్నారననేరు.

వర్షాలు వల్ల ఇల్లు మునిగిపోతున్నాయి.నిత్యవసర వస్తువులు తడిచిపోయాయి.ప్రభుత్వం తాత్సారం చేయకుండా.. పైసల కోసం చూడకుండా.. నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకొని ఆర్థిక సాయం అందించాలి. హైదరాబాదులో పూర్తిస్థాయిలో అసెస్మెంట్ చేసి ఎక్కడ ముంపు గురవుతుంది, ఎక్కడ నాలాలు పొంగుతున్నాయి.. అంచనాలు వేసి స్ట్రాటజీ నాలా లాంటి ప్రోగ్రాం ని తీసుకొని దీనికి శాశ్వత పరిష్కారం అందించాలి. డాంబర్ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పది నిమిషాల ప్రయాణం గంట గంటన్నర సమయం పడుతుంది. కాబట్టి యుద్ధ ప్రాతిపదికన రోడ్లన్నీ మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. కాలనీలో మునిగిన ఇల్లు, గోడలు తడిచి ఫంగస్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వం హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి అంటూ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను. ఇలలో బురద వచ్చి కరాబ్ అయిన ఇళ్ళను ప్రభుత్వ యంత్రాంగం ద్వారా క్లీన్ చేయించి ప్రజలకు అందించాలని డిమాండ్ చేసారు. %వవ% కార్యక్రమం లో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి , బీజేవైఎం మాజీ రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్ , బీజేపీ సీనియర్ నాయకులు %= ఎ% శ్రీనివాస్ , సేవా పక్షం స్టేట్ కో -కన్వీనర్ గీత మూర్తి మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ , వినాయక్ నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి , నేరెడ్మేట్ డివిజన్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి , మౌలాలి కార్పొరేటర్ సునీత యాదవ్ , బీజేపీ రాష్ట్ర, జిల్లా,మరియు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలంటూ ఆహ్వానాలు.



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 19** ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలంటూ మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు పలు ఆలయాల నుండి ఆహ్వానాలు అందాయి. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి ఆలయ %జూ% మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అదేవిధంగా అమీర్ పేట లోని హనుమాన్ దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, పద్మారావు నగర్ లోని పోల్ బాల్ హనుమాన్ దేవాలయాల అధికారులు కూడా దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆయా దేవాలయాల అధికారులు నరేందర్ రెడ్డి, జయంతి, అంబుజ, మల్లిఖార్జునప్ప, రాంగోపాల్ పేట, అమీర్ పేట డివిజన్ ల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, వనం శ్రీనివాస్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



# తెలంగాణ తల్లి పేరు కూడా చెప్పుకోలేని స్థితిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

### తెలంగాణ విమోచన దినోత్సవాన్ని దాచిపెట్టే కాంగ్రెస్బీఆర్ఎస్: డా. బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్ సెప్టెంబర్ 19 ;తెలంగాణ తల్లి పేరు కూడా చెప్పుకోలేని స్థితిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు.శుక్రవారం ఆయన రాష్ట్ర బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, "తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడం బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలకు సాధ్యపడలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని సమైక్యతా దినోత్సవంగా మార్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ప్రజాపాలన దినోత్సవం పేరిట తప్పించుకుంటోంది. వీరంతా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, వేలాది అమరవీరుల త్యాగాలను అవమానపరుస్తున్నారు" అని అన్నారు.సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో భారత సైన్యం ఐదు రోజుల్లోనే ఆపరేషన్ పోలో ద్వారా నిజాం రజాకార్లను ఓడించి, తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిందని గుర్తుచేశారు. "అందుకే సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలి" అని స్పష్టం చేశారు.కర్ణాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలే విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నాయని, తెలంగాణలో మాత్రం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్?బీఆర్ఎస్ దానిని దాచిపెడుతున్నాయని ఆరోపించారు."తల్లిని కూడా అమ్ముకునే స్థాయికి దిగజారిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలను ప్రజలు గుర్తించారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను బొందపెట్టాలి. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా అధికారికంగా నిర్వహిస్తాం" అని డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 : అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా టి. ఎల్.ఎం.మేళాకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య,ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల భవితవ్యాన్ని బంగారుమయం చేసి, వారి జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత గల వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. పిల్లల తల్లిదండ్రులలో దినసరి కూలీలు, ఉద్యోగులు,అనేక రంగాలలో పనిచేస్తున్న వారు ఉంటారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తారని తెలిపారు. పిల్లల అవసరాలు తీర్చి ఏకాగ్రతతో చదువుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్,హిందీ,తెలుగు భాషలలో చదవడం,రాయడం, మాట్లాడడం తప్పనిసరిగా వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. సాధారణ విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల పిల్లలలో అభ్యసన నైపుణ్యాలు మెరుగ్గా ఉంటాయని,ఇదే స్థాయిలో విద్యార్థులందరిలో పఠన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.తల్లితండ్రులు తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ఇతర ప్రాంతాలలో స్థిరపడి చదువు నేర్పించేందుకు కృషి చేస్తూ ఉంటారని తెలిపారు.మానవ జీవితంలో విద్యకు అంతటి ప్రాముఖ్యత ఉంటుందని, చిన్నపిల్లలు ఏ విషయాన్నైనా త్వరగా నేర్చుకుంటారని అన్నారు.కొంత మంది చదువు లేని తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు శ్రమిస్తుంటారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో విద్య, అభ్యాసన ప్రమాణాలను మెరుగు పరచడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాల నడుమ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించడం జరుగుతుందని,ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, నిరంతర విద్యుత్ సరఫరా,ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర అనేక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరికి చదువు ఆవశ్యకతను తెలియజేయాలని, ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన సదుపాయాలపై ప్రతిపాదనలు సమర్పిస్తే సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో వంటశాల, భోజనశాల, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.జిల్లాలో నూతనంగా 270 మంది ఉపాధ్యాయులను నియమించి విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి ప్రతి రోజు క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. చదివితే కలిగే ప్రయోజనాలు ఆలస్యంగా తెలుస్తాయని, ఉపాధ్యాయులు లర్నింగ్,టీచింగ్ పద్ధతులను విద్యార్థులకు అర్థమయ్యేలా పాటించాలని తెలిపారు. పిల్లలు ఆటలు,పాటల ద్వారా అధికంగా నేర్చుకుంటారని, పిల్లలలో చదువుపై ఆసక్తి కలిగేలా కథలు, ఇతర అంశాల రూపంలో ఆకర్షించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆవిష్కరణలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో బిషప్ డా. పీటర్ నాయక్

## లకావత్ కు ప్రపంచ శాంతి ప్రతిభ అవార్డు



ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 19 (ప్రజాబలం) ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చాంప్లా తండాకు చెందిన బిషప్ డా. పీటర్ నాయక్ పీటర్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు మరియు చైర్మన్‌గా దేశంలోని అనేక రాష్ట్రాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు తన ట్రస్ట్ ద్వారా అలాగే వ్యక్తిగతంగా కూడా ఆయన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఒడిశా ఛత్తీస్‌గఢ్ ఉత్తరప్రదేశ్ జార?ండ్ రాజస్థాన్ బీహార్ తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పేద కుటుంబాలను సందర్శించి వారికి నిత్యావసర సరుకులు మరియు ఆర్థిక సహాయం అందించారు ప్రత్యేకంగా కరోనా మహమ్మారి సమయంలో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని అనేక కుటుంబాలకు నిత్యావసర సరుకులు వస్త్రాలు పంపిణీ చేశారు ఆయన సేవలు ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితం కాలేదు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఒడిశా కర్ణాటక రాష్ట్రాల్లో కూడా జాతీయ స్థాయిలో సేవలు అందించారు బిషప్ డా. పీటర్ నాయక్ లకావత్ స్వస్థలం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చాంప్లా తండా ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో నివసిస్తున్నప్పటికీ ఆయన అనేక ప్రాంతాలకు వెళ్లి సామాజిక సేవలు చేస్తున్నారు ఇటీవల ఆయన చేసిన జాతీయ స్థాయి సేవలను మార్ద్ ఆర్గనైజేషన్ గుర్తించి, ఆయనకు ప్రపంచ శాంతి ప్రతిభ అవార్డుని ప్రదానం చేసింది. ఈ గుర్తింపు రావడం పట్ల డా. పీటర్ నాయక్, అలాగే ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ గురువారం సాయంత్రం హైదరాబాద్ నాంపల్లి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మార్ద్ ఆర్గనైజేషన్ 28వ వార్షికోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ సామాజిక సేవలు చేసిన వారితో పాటు కొంతమంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు ఈ సందర్భంలో బిషప్ డా. పీటర్ నాయక్ లకావత్ ప్రముఖ సినీ నటి రాగిణి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంత గొప్ప వేదికలో ఆమె చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించడం నాకు ఎంతో గర్వంగా ఉంది అని తెలిపారు

### మహిళలు ప్రత్యేక ఆరోగ్య క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం పై అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా , సెప్టెంబర్ -19 (ప్రజాబలం ప్రతినిధి)మహిళల ఆరోగ్యం కోసం స్వస్త్ నారీ, పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, స్వస్త్ నారీ, సశక్తి అభియాన్ కార్యక్రమం అమలు పై వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ పరిధిలో స్వస్త్ నారీ సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా ప్రత్యేక వైద్యులతో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అన్నారు. హెల్త్ క్యాంపు కు స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరయ్యేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.వైద్య ,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మన జిల్లాలో 99 క్యాంపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, అనేమియా, టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని అన్నారు. గైనకాలజిస్ట్, ఐ స్పెషలిస్ట్ ,ఇయర్స్ స్పెషలిస్ట్, డేర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్యుల సేవలను వినియోగించుకోవాలని అన్నారు.జిల్లాలోని ప్రతి గర్భిణీ మహిళ 100 శాతం ఏ.ఎన్.సి చెకప్ చేయించుకునేలా చూడాలని, పిల్లలకు అవసరమైన ఇమ్యునైజేషన్ డోసులు సకాలంలో అందించాలని అన్నారు. మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత ప్రోగ్రాం ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 : ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ సేవల కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, విధులు బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు.జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియలో భాగంగా పనులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యత,తరగతి గదులు,రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు.విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం,శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు.ఉపాధ్యాయులు విధులలో సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని,తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేశారు. వెంకటాపూర్ గ్రామంలో నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ పై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

# 2002-2025 ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 : 2002 -2025 ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.శుక్రవారం హైదరాబాద్ నుండి ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002,2025 ఓటరు జాబితాల సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ఓటర్ల జాబితాల మధ్య విశ్లేషణ,మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని,రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలనను వ్యవస్థీకృతంగా నిర్వహించేందుకు 4 కేటగిరీలుగా విభజించి తదనగుణంగా నిర్దేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేటగిరీ ఎ-లో 2002, 2025 రెండింటి జాబితా లోనూ ఒకే వ్యక్తి పేరు ఉన్నట్లయితే ఏ విధమైన డాక్యుమెంట్ అవసరం లేదని,ఈ చర్య స్పష్టంగా సరిపోలిన కేటగిరీగా పరిగణించబడుతుందని తెలిపారు. కేటగిరీ బి-2002 జాబితాలో పేరు లేదు,కానీ వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 కన్నా ముందు అయి ఉండాలని, అటువంటి వారు ఎన్నికల సంఘం సూచించిన 11 డాక్యుమెంట్లలో కనీసం ఒక్కటి సమర్పించాలని తెలిపారు.కేటగిరీ సి లో 2002 జాబితాలో పేరు లేదు,వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 నుండి 2002 మధ్య (తద్వారా 18 సంవత్సరాలు కన్నా తక్కువ వయస్సు) అటువంటి వారు ఒక స్వీయ డాక్యుమెంట్, కుటుంబ సంబంధిత డాక్యుమెంట్ మర్పించాలని తెలిపారు.కేటగిరీ డి- 2002లో పేరు లేదు, 2004 తర్వాత జన్మించినవారు కానీ, 2025 జాబితాలో పేరు ఉందంటే ఒక స్వీయ డాక్యుమెంట్,తల్లిదండ్రుల డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.ఈ నెల 24వ తేదీ గా నివేదికలు సమర్పించాలని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు రూపొందించాలని తెలిపారు.నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పిల్లలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను ఎన్నికల విభాగం అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ,తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దాం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 19 :సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు లతో కలిసి పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అక్టోబర్ 16వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిరోజు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత,పౌష్టిక ఆహారం పై అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులు తమ వివరాలు నమోదు చేసుకుని, సమయానుసారంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు వారి ఇండ్లలోని మగవారికి పాటించవలసిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో అందించాలని తెలిపారు.సూపర్ వైజర్లు తమ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను పర్యవేక్షించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అంగన్వాడీ టీచర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని,మూత్రశాలలు లేని అంగన్వాడి కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం క్రింద ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం పోషణ మాసం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్, సి.డి.పి.ఓ.విజయ, రజిత,పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌజన్య,జిల్లా ప్రాజెక్టు సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం), దక్షిణ** కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రులు మరియు బతుకమ్మ పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ధర్మగుండం శుద్ధి చేయడం, ఆలయ ప్రాంగణం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడం, స్వామివారి బంగారు - వెండి సేవ వాహనాలను శుభపరచడం వంటి ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.

భక్తులు, ముఖ్యంగా వేములవాడ పట్టణ మహిళలు బతుకమ్మ ఆడే సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా, పూర్తిగా సౌకర్యాలు కల్పించే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

శ్రీదేవి నవరాత్రోత్సవాలు 22-09-2025 సోమవారం నుండి 02-10-2025 గురువారం వరకు(11) రోజులు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ఆర్జిత సేవలైన నిత్య కళ్యాణములు, మహాలింగార్చన, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతములు, ఆకుల పూజలు, పల్లకి సేవలు నిలిపివేసున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అభిషేకములు, అన్న పూజలు మాత్రం సమయానుకూలంగా నిర్వహించబడునని, మరియు 01-10-2025( మహార్నవమి): తెప్పోత్సవం.

02-10-2025( విజయదశమి) అంబారీ సేవ, శమీ పూజలు ఉన్నందున, ఈ రెండు రోజుల్లో పెద్ద సేవ టికెట్లు కూడా నిలిపివేయబడతాయని, కావున భక్తులు గమనించగలరని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

నవరాత్రుల సందర్భంగా రోజువారిగా అమ్మవారి అలంకారం ల వివరములు(2025)

22-09-2025: శైల పుత్రి దేవి అలంకారం.
23-09-2025: బ్రహ్మచారిణి అలంకారం.
24-09-2025: చంద్ర గంటా దేవి అలంకారం.
25-09-2025: కూష్మాండా దేవి అలంకారం.
26-09-2025: కూష్మాండా దేవి అలంకారం.
27-09-2025: స్కందమాత అలంకారం.
28-09-2025: కాత్యాయిని దేవి అలంకారం.
29-09-2025: కాళరాత్రి దేవి అలంకారం.
30-09-2025: మహా గౌరీ దేవి అలంకారం ( దుర్గాష్టమి).
01-10-2025: సిద్ధి రాత్రి దేవి అలంకారం ( మహార్నవమి ).
02-10-2025: శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం, పాలవెల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారం( విజయదశమి ).

# ఏకమైన కాంగ్రెస్, బీసీ సంఘాలు.
# సిరిసిల్ల జిల్లా కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని కొనసాగుతున్న నిరసనలు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం )**, సెప్టెంబర్ 17వ తేదీ ఎస్పీ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జెండా ఆవిష్కరించే సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమయపాలన పాటించకపోవడం, జాతీయ గీతాలాపన సమయంలో చివరలో తన వాహన శ్రేణిలో సైరన్ మోగించుకుంటూ వచ్చి జాతీయ జెండాకు నమస్కారం చేయడం, జెండా ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రసంగ పాఠాన్ని తయారు చేయకపోవడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, జిల్లా బీసీ సంఘాల నేతలు ప్రోటోకాల్ పాటించకపోవడం పట్ల తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలు, బీసీ సంఘాల నేతలు, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ను రెండు రోజుల్లో బదిలీ చేయకుంటే బీసీ సంఘాల జేఏసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని అందులో భాగంగా మొదట



చలో సిరిసిల్ల, తర్వాత చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ బాధితులంతా ఒక్క తాటిపైకి వచ్చి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోసం ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. బీసీ కుల సంఘాల ప్రతినిధులు సిరిసిల్ల కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని వేములవాడలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి కి ఫిర్యాదు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీసీ కాబట్టే కలెక్టర్ అవమానపరిచాడని, ప్రభుత్వం వెంటనే కలెక్టర్ ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ ఆది బీసీ కావడం పట్ల ప్రోటోకాల్ ఇవ్వలేదని, వేములవాడలో బీసీ సంఘాలు ధ్వజమెత్తాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘ అధ్యక్షుడు పొలాస నరేందర్, వేములవాడ మాజీ జెఎసి కన్వీనర్ బొజ్జ కనకయ్య, పులి రాంబాబు గౌడ్, తూపుకారి సత్తయ్య, పీర్ మమ్మద్, భూమయ్య, ముప్పిడి శ్రీధర్, తదితర బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య పరిరక్షణ తోనే కుటుంబ వ్యవస్థ బలోపేతం సాధ్యం

జగిత్యాల, మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యానికి మూలాధారమనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్థ నారీ స్వశక్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు జగిత్యాల జిల్లా అడిషనల్ డీఎంహెచ్వో ఎన్ శ్రీనివాస్ అన్నారు.స్వస్ద నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా పట్టణంలోని జై శెట్టి రాం వేల్ యూజి పిహెచ్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో జగిత్యాల జిల్లా అడిషనల్ డీఎంహెచ్వో ఎన్. శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మహిళలకు, కిశోర బాలికలకు, గర్భిణీ, స్త్రీలకు వచ్చే వివిధ ఆరోగ్య సమస్యలకు పరీక్షించి మందులు అందజేశారు. వివిధ రక్త9 పరీక్షలు హిమోగ్లోబిన్,టీబి పరీక్షలు,ఆయుష్ వైద్య సేవలు చేపట్టారు. వ్యాధి నిరోధక టీకాలు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ డీఎంహెచ్వో ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత, టీవీ, షుగర్ క్యాన్సర్ రోగులపట్ల అవగాహన కల్పించడంతోపాటు వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేసేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్న వైద్యులకు తెలియజేసి ముందుగానే చికిత్స అవసరమైన మందులు వాడుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో అనేక రకాల కొత్త కొత్త వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండి వైద్యుల సలహాలు సూచనలు పాటించి ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. మహిళా ఆరోగ్య పరిరక్షణలోనే కుటుంబ వ్యవస్థ బలోపేతం సాధ్యమైతుందని అన్నారు.మహిళలు, కిశోర బాలికలు, గర్భిణీలు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ టి. శివాణీ, సివో వేణుగోపాల్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, కిశోర బాలికలు, గర్భిణీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నార్తుల అన్నదాన కార్యక్రమానికి 2.5 క్వింటాళ్ల సన్న బియ్యం వితరణ.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనునిత్యం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి బియ్యం అందజేసిన ఎర్రం శ్రీనివాస్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కరోనా కష్టకాలం నుండి పేదలకు, అన్నార్తులకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వేములవాడ అర్బన్ మండలం అనుపురం వాస్తవ్యులు ఎర్రం శ్రీనివాస్ తండ్రి కొండయ్య దాదాపుగా 15 వేల రూపాయల విలువచేసే 2.5 క్వింటాళ్ల బిపిటి సన్నబియ్యం అందజేయడంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎర్రం శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, మేమెంటో అందజేయడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.

ఈ సందర్భంగా దాత ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ దాతల సహకారంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదలకు అన్నదాన కార్యక్రమాలు, ఆపదలో ఉన్న వారికి దాతల నుండి విరాళాల రూపంలో సేకరించి వారికి అందించడంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ముందు ఉందని, నేను నా వంతుగా సహకారం అందించాలన్న ఉద్దేశంతో శుక్రవారం రోజున ప్రతిరోజు జరిగే అన్నదాన కార్యక్రమానికి 2.5 క్వింటాళ్ల బి పి టి సన్న బియ్యం ట్రస్ట్ వారికి అందజేయడం జరిగిందని తెలిపారు

అనంతరం ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ, పేదల అన్నదాన కార్యక్రమానికి బియ్యం అందించిన ఎర్రం శ్రీనివాస్ ను అభినందిస్తూ ట్రస్ట్ ద్వారా చేసే అన్నదాన సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వోడ్యాలా వేణు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పసుల శ్రీనివాస్, జిల్లెల్ల దేవయ్య, గజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ జీవితం అందరికీ ఆదర్శం
## బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు గౌడ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 19:** భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ 75 వ జన్మదినం సందర్భంగా శుక్రవారం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సేవా పక్షం జిల్లా కన్వీనర్ పట్టి వెంకట కృష్ణ, సేవా పక్షం కో కన్వీనర్ పాకాల శ్రీలత ఆధ్వర్యంలో మందమర్రి సింగరేణి పాఠశాల విద్యార్థులకి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ జీవిత చరిత్ర మనకి ఆదర్శం అని అన్నారు. ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చి చదువుకుంటూనే తల్లి తండ్రులకు వ్యాపారంలో సహాయ పడుతూ రైల్వేస్టేషన్ లో చాయ్ అమ్మే స్థాయి నుండి ప్రధానిగా ఎదిగి ప్రపంచ దేశాలు నరేంద్ర మోదీనీ ఆదర్శంగా తీసుకునే స్థాయికి చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అందుగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు అక్కల రమేష్,




సీనియర్ నాయకులు దీవి దీక్షితులు, మందమరి పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, రూరల్ అధ్యక్షులు జనార్ధన్, సీనియర్ నాయకులు మందమర్రి పట్టణ ఇంచార్జ్ సంజీవరావు, ధారా రవి సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతునూరు రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శనిగారపు శ్రీనివాస్, కార్యదర్శి దుర్గం సత్యం బాబు, గాదె రాములు, రామ కృష్ణపూర్ ప్రధాన కార్యదర్శి పద్మ, ప్రియాంక, పోతులూరి లలిత, సంధ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

# అరె కటికలకు రూ. 500 కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి
## బిసి-డి నుండి బిసి ఎ హొదా కల్పిస్తూ జి.ఓ. తేవాలి
## అరె కటిక అభివృద్ధి సంఘం డిమాండ్




హైదరాబాద్ సెప్టెంబర్ 19 అరె కటికలు ఆత్మగౌరవంగా బతుకాలంటే రూ. 500 కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన ఐ (2) వైన్స్ టెండర్లలో 30శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని అరె కటిక అభివృద్ధి సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సంఘం రాష్ట్ర అద్యక్షులు జి. భూంపల్లి అశోక్ కుమార్ మాట్లాడుతూ "మటన్ వృత్తి సారా వృత్తి"జన్మత మాదే అయినా మాకు గత ప్రభుత్వం 2021 సం.లో నూతన ఎక్సైజ్ పాలసీలో సైతం అన్యాయం చేసింది. అప్పటి ఎక్సైజ్ శాఖామంత్రి గౌదలకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% ఏ మాత్రం సంబంధంలేని, వీరికి కట్టబెట్టిందు. మాకు న్యాయం చేయండని అనేక ఉద్యమాలు చేసినా, మెమోరాండాలు ఇచ్చినా మా ఆరె కటికలకు న్యాయం జరుగలేదాని ఆవీదన వ్యక్తం చేసారు. బిసి-డి నుండి బిసి ఎ హొదా కల్పిస్తూ జి.ఓ. తేవాలని, మా మటన్ షాపులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి. మా ఆరెకటిక మహిళలకు రూ.3 లక్షల బ్యాంకు రుణం 90శాతం సబ్సిడీతో మటన్ క్యాంటిన్లు, చొక్నాబోటి కర్రీపాయింట్లు ఏర్పాటు చేయాలని, మాకు 80శాతం సబ్సిడీతో గొర్ల పంపిణీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశం లో ప్రదానన కర్యదర్శి కే.నందేశ్వర్,ఉపాధ్యక్షులు నాగ శెశు, వెంకటేశ్వర్, జి. రమేష్, జి,కోశాధి కారి కే.దినేష్, నరేందర్ జి,shiva ప్రసాద్, బాల కిషన్ జి,జమాల్ పురం శ్రీనివాసులు తదితరులు పాల్ గోన్నారు.

# మణికొండలోని అవినీతిని ఎండకట్టిన బి.ఆర్.ఎస్



రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 18 సెప్టెంబరు 2025ఈ రోజు గురువారం రోజున కొన్ని పత్రికలలో కాంగ్రెస్ పార్టీ వారు వెల్లిబుచ్చిన అభిప్రాయం చాలా హాస్యాస్పదంగా ఉన్నదని. మణికొండ పురపాలక సంఘ పరిధిలో సొంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన సమాచారం ప్రకారం ఎవరు అక్రమార్కులో ఎవరు సక్రమార్కులో ? తేట తెల్లముతున్నదని, తత్వార ఎవరి ప్రోద్బలంతో చెరువులు, కుంటలు, నాలాలు, పార్క్ స్థలాలు, సెప్టిక్ ట్యాంక్ స్థలాలు, ఆలయ స్థలాలలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలు ఎలా జరిగాయో ప్రతి ఒక్కరికీ వాస్తవాలు తెలుసు. ఇకపోతే సీతారాం ధూళిపాళ అనే వ్యక్తి తెలంగాణ అభిమానిగా 2014 మరియు 2018 ఎన్నికలలో అప్పటి టి.ఆర్.ఎస్ పార్టీకి పనిచేసిన విషయం మణికొండ పురపాలక సంఘం పరిధిలోని ప్రజానీకానికి తెలిసిన విషయమే. అన్ని తెలిసి సీతారాం ధూళిపాళ వ్యక్తిత్వం తెలిసిన తరువాతనే వారిని 2018 లో మొదలు అన్ని కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అటు పిమ్మట పంచవటి కాలనీ అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిన సంగతి జగమెరిగిన సత్యం కాగా, మీడిసి పాటుతో ముందుకు సాగుతున్న కొంత మంది చాడస్తులకు ఏమి చెప్పినను వినబడదు కనబడదు. ఆ తరువాత 2023 లో జరిగిన రాజేంద్రనగర్ శాసన సభ ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ పార్టీకి మణికొండలో మెజారిటీ తీసుకు రావడంలో కీలక పాత్ర వహించినను దురదృష్ట వశత్తూ గెలిచిన శాసన సభ్యుడు పార్టీ మారిన దరిమిలా కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా రాజీనామా చేసి ఆపత్ కాలంలో స్థానిక పార్టీ పగ్గాలు చేపట్టిన పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళను ఏ విషయంలో తులనాడిన ఊరుకునేది లేదని తెలుపుతూ, గత పది సంవత్సరాలుగా బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు ప్రజా ప్రయోగ పనులు చేయడమే కానీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని దోచు కోలేదనీ, విర్ర వీగలేదని తెలియ పరిచారు. స్థానిక కాలనీ సంఘాలను అడ్డు పెట్టుకొని 2023 ఎన్నికలలో ఎవరి డబ్బుతో ఎవరు చిందులు, విందులు, వినోదాలు చేయించారో, చేసుకున్నారో ఒక్కసారి కాంగ్రెస్ ముసుగులో ఉన్న సదరు స్థానిక అసోసియేషన్ నాయకులు మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, అన్ని విషయాలు మణికొండ ప్రజానీకానికి సవివరముగా తెలుసని గుర్తించ వలసిందిగా తెలియ పరుస్తున్నాము. ఇకపోతే ది సిటిజన్స్ కౌన్సిల్ అనే సంస్థ ద్వారా సమకాలీన ప్రజలకు సామాజిక సేవ మరియు రాజకీయ అవగాహన అనుబంధంగా, ప్రజాస్వామ్య బద్ధంగా వెలసిన సంస్థ, కానీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొంత మంది నాయకులు సమాజ సేవ పేరుతో సంస్థలు పెట్టి పని చేస్తున్న విషయాలు గ్రహించకుండా కొద్ది మంది కాలనీ సంఘాల ముసుగులో కాంగ్రెస్ పార్టీకి పని చేస్తున్న విషయం తేట తెల్లమవు తున్నదని, పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ, తనని ఎవరు గమనించట్లేదన్న చందాన ఉంది. మహాత్మా గాంధీ పార్కులో వినాయకుని పూజ పేరుతో అల్కాపూర్ గణేష్ మండల సంస్థను నిర్వహిస్తున్న కాంగ్రెస్ స్థానిక అధ్యక్షుడుగా జితేందర్ మెరుగు గురివింద గింజ మాదిరి పలుకడం వింతగా ఉన్నదని అక్షర్య చకుతులైనారు. తదుపరి ఆల్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి నరసింహం అలియాస్ వంశీ ఏమో స్నేహం పేరుతో కాంగ్రెసు ముసుగులో, స్థానిక అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి దిండి శ్రీనివాస్ ఏమో కాంగ్రెసు పార్టీ నాయకుడిగా కొనసాగుతూ రాజకీయం చేస్తూ స్థానిక అసోసియేషన్ లో ముఖ్య భూమిక పోషిస్తున్నట్లు స్థానికులు అభిప్రాయం వెల్లబుచ్చారు, అందుకు అనవసర విషయాలలో తలదూర్చక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని హిత బోధ చేస్తూ, అధికారం ఉంది కదా అని విర్రవీగితే ఓడలు బళ్ళు, బళ్ళు ఓడలైన సంగతి చరిత్ర పుటలు తిరగేస్తే తెలుస్తుంది. అభివృద్ధిని అడ్డుకోవడం అంటే అక్రమ కట్టడాలను, ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన భూములు ఆక్రమణలకు గురి కావడం, ఎఫ్టీఎల్ బఫర్ జోన్లలో భవనాలను నిర్మించడం, ఒక రోడ్డుకు వేసిన ఎస్టిమేట్ ని ఇంకొక రోడ్డుకు వాడుకోవడం, ఆర్టిఐ ద్వారా సమాచారం సేకరించడం లాంటి కార్యక్రమాలు ప్రశ్నించడమేనా ? మీ తాటాకు చప్పుళ్ళకు భయపడకుండా గతంలో జరిగిన అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తూనామని, ఇకముందు ప్రశ్నిస్తూనే ఉంటామని స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు తెలిపారు. అంతేకాదు ఎవరైతే ఈరోజు అధికారాన్ని అడ్డం పెట్టుకొని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారో ఎవరైతే వీటిని ప్రోత్సహిస్తున్నారో ఎవరైతే కాలనీ సంఘాల పేరుతో రాజకీయం చేస్తున్నారో వారి అందరి పేర్లు మా పింక్ బుక్ లో వ్రాయడం జరుగుతున్నదని, అధికారం, కాలం ఎప్పుడూ ఎవరి ఒకరి సొత్తు కాదనీ, అన్ని సమస్యలకు కాలమే పరిష్కరిస్తుందని, కాలమే శిక్షిస్తుందని తెలుసుకొని మసులు కోవాలని తెలియ చేయడం జరిగినది. సత్యమేవ జయతే. జై బి.ఆర్.ఎస్, జై కే.సి.ఆర్.

# సింగూరు ప్రాజెక్టుకు పెరిగిన వరద అత్యవసరంగా లేపిన మరో మూడు గేట్లు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా : ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా బాగారెడ్డి, సింగూర్ ప్రాజెక్టు, ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల, 50, వేల క్యూసెక్కుల వరద నిరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని, ఈ వరద నీటిని దిగువకు(19,9,2025) రోజు మధ్యాహ్నం 3, 00, గంటలకు ప్రాజెక్టు గేట్ నెంబర్(14,4,5,) గేట్లు 2,00, మీటర్లు ఎత్తి , గేట్ నెంబర్(3,8,9,%ల%10,) 1,50, మీటర్లవరకు అత్యవసరంగా ఎత్తి,60, వేల క్యూసెక్కుల వరకు దిగువకు వదలడం జరుగుతుందని, సింగూరు ప్రాజెక్టు నీటిపారుదల శాఖ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,బి, ఫీమ్, తెలియజేశారు, ప్రాజెక్టు దిగువ ప్రాంతాల వారు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలరని, మంజీర నది పరివాహక ప్రాంత ప్రజలు, మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువులు,గొర్ల, కాపరులు, మరింత అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లేవారు, నదిలోకి వెళ్లరాదని ఆయన తెలియజేశారు, ప్రస్తుతం ప్రాజెక్టులోకి యావరేజ్ ఇన్ ఫ్లో 52139, క్యూసెక్కులు కాగా యావరేజ్ అవుట్ ఫ్లో 56597, క్యూసెక్కులు, జెన్కో,1858, క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కి,80, క్యూసెక్కులు, సింగూర్ లెఫ్ట్ కెనాల్ కు,120, క్యూసెక్కులు మిషన్ భగీరథకు,70,క్యూసెక్కులు,ఎవపోరేషన్ 390, క్యూసెక్కులు, కాగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29,917, టీఎంసీలు అయితే ప్రస్తుతం,17,215, టీఎంసీలుగా ఉందని, ప్రాజెక్ట్ అధికారులు తెలియజేశారు....

# ఇంతవరకు బతుకమ్మ చీరలు ఇవ్వని ప్రభుత్వం

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ఎంత ప్రాముఖ్యత ఉందో గత ప్రభుత్వంలో ఇచ్చిన బతుకమ్మ చీరలకు కూడా అంతే ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్న ఇప్పటివరకు బతుకమ్మ పండుగకు ఆడబిడ్డలకు చీరలను ఇవ్వకపోవడం పైన అసహనం వ్యక్తం చేశారు. నేడు కూకట్ పల్లి నియోజకవర్గం లోని రంగధాముని చెరువును ఆయన సందర్శించి బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాలలో భాగంగా కూకట్ పల్లిలో ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ ఒక రోజు ముందుగానే అనగా శనివారం రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు.మన సంస్కృతి సాంప్రదాయాలను ఏ ప్రభుత్వమైనా కొనసాగించాలని ఇప్పటివరకు ప్రభుత్వం దీనిపైన నోరు మెదపకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. 20వ తేదీ నుండి 29వ తేదీ వరకు బతుకమ్మ పండుగ ఉత్సవాలు జరుగుతాయని 29వ తేదీన రంగధాముని చెరువు వద్ద భారీ ఎత్తున సద్దుల బతుకమ్మ జరుగుతుందని సుమారు 70 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించి సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# చినుకు పడితే చిత్తడి విద్యార్థుల కష్టాలు

## వర్షపు నీటితో నిండిన పాఠశాల ప్లే గ్రౌండ్

## మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం శూన్యం

## పట్టించుకోని అధికారులు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా : విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, చెబుతున్న మాటలు వేదికల ప్రసంగాలకే పరిమితం అవుతున్నాయి, క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోలేదు, అందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలోని, ప్రాథమిక పాఠశాల ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది, చినుకు పడిందా ఇక అంతే సంగతి, పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ఇక్కట్లు పడాల్సిందే, పాఠశాల ప్లే గ్రౌండ్ మొత్తం నీటితో బురద మైయంగా మారుతుంది, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి, ఇక్కడి బాల విద్యార్థులు, ఈ విషయమై మున్సిపల్ అధికారులకు, లిఖితపూర్వకంగా రాసిచ్చినప్పటికీ, ఫలితం లేకుండా పోతుందని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జగదీశ్వరి,ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా ఈ నియోజకవర్గం నుంచి, ప్రాతినిధ్యం వహిస్తున్న, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ,ఈపాఠశాల పై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్లే గ్రౌండ్లో మొరం వేయించి బాగు చేయించాలని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు....



# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19 మున్నూరు కాపు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయు లకు పొనగంటి రవికుమార్ (పిజెఆర్) ఆధ్వర్యంలో వారికీ ఘన సన్మానం చేశారు. పట్టణంలోని మోత్కుల గూడెం ని చెందిన మున్నూరు కాపు ముద్దుబిడ్డ లైన ఏబూషి శ్రీనివాస్, ఏభూషి సతీష్ కుమార్, ఉడుగుల సంపత్ లకు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు వచ్చినందుకు మున్నూరు కాపు కులసభ్యులు అభినందనలు తెలుపుతూ మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి మంచి ఆణిముత్యాలుగా తయారైనటువంటి మీరు ఇంకా అనేకమంది ఆణిముత్యాలు తయారు చేయాలని అప్పుడేలి సమాజంలో అంటరానితనం పోతుందని నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కడం జనార్దన్, పొన్నగంటి రవికుమార్ (పీజేఆర్),ఏభూషి కౌశిక్, ఆకుల రాజేందర్, కొలకానిరాజు,నందా మహేందర్,పొన్నగంటి సందీప్, పంతటి అరవింద్, ఆకుల పోచయ్య, మహేందర్,పొనగంటి సతీష్, రాజు,సీరియల విజయ్, ఏభూషి అజయ్,శెట్టి రాజు, పొనగంటి ప్రభాకర్,పొనగంటి శంకర్,సతీష్, సంపత్, స్వామి,ఉదయ్ భాస్కర్, సంపత్, అరుణ్,గణేష్, ఆకుల రాజు, భారీ సంఖ్యలో కుల బాంధవులు పాల్గొన్నారు.

# రైల్వే కార్మికుల ఆందోళన



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19 దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జమ్మికుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు చేయాలని ఆందోళన నిర్వహించారు . ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ ఉప్పుల రాజయ్య మాట్లాడుతూ రైల్వేలో కనీస వేతనాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తక్షణమే 8వ వేతన కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2026 జనవరి నుండి వేతన పే కమిషన్ అమలు చేయాలని, కార్మికులపై పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రెటరీ బి. శ్రీనివాస్, కోశాధికారి సాంబరాజు, అసిస్టెంట్ సెక్రటరీ బీసముండయ్య, ఇ రమేష్ యూత్ కన్వీనర్ పి. కుమరస్వామి కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా మద్దుల



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19 మద్దుల అంటేనే సేవ అంటేనే మద్దుల అనే పేరు సంపాదించుకున్న వీణవంక మండలం లక్ష్మక్కపల్లి గ్రామ యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్. ఏ ఆపద వచ్చిన తనకు తోచిన సహాయం చేస్తాడు.ఇటీవల మృతి చెందిన దాసారపు సర్వయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసిన గ్రామ యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దాసరపు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సుజాత లక్ష్మణ్, దోమకొండ రవి,ఇసాక్,లింగాల నారాయణరెడ్డి ,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## మార్కెట్ బస్టాండ్ లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

### డిపో మేనేజర్ కి వినతిపత్రం ఇచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 19:**మందమర్రి మార్కెట్ కు వివిధ డిపోల బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మందమర్రి యువజన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మంచిర్యాల డిపో మేనేజర్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి పట్టణం నుండి మంచిర్యాల్, హైదరాబాద్ కి వెళ్లే విద్యార్థులు,వివిధ దుకాణాలలో, షాపింగ్ మాల్ లో పనిచేసే ప్రజలు, ఉపాధి కొరకు నిరంతరం వెళ్తుంటారని తెలిపారు. సింగరేణి కార్మికులు కూడా ఉద్దేశించి పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని మందమర్రి మార్కెట్ నుండి మంచిర్యాలకు బస్సు వేయాలని కోరారు. బెల్లంపల్లి నుండి మంచిర్యాలకు వెళ్లే బస్సులను ఉదయం 3 ట్రిప్పులు సాయంత్రం మూడు ట్రిపుల్ మార్కెట్ లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మందమర్రి మార్కెట్ నుండి హైదరాబాద్ కి గత కొద్ది కాలం నుండి బస్సులు రావడం లేదని కూడా తెలిపినట్లు వారు వివరించారు. సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ సీరం జనార్ధన్ వారం రోజులలో మందమర్రి మార్కెట్ నుండి హైదరాబాద్ కి బస్సు వేస్తామని హామీ ఇవచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయాలపై మంచిర్యాల డిపో మేనేజర్ సీరం జనార్ధన్ స్పందినట్లు వారు తెలిపారు. మందమర్రి మార్కెట్లో ఉదయం 9 గంటలకు వెళ్లే మంచిర్యాల బస్సు 20 నిమిషాలు మార్కెట్ బస్టాండ్ లోనే ఆపుతామని హామీ ఇచ్చారన్నారు. అతి త్వరలో మార్కెట్ నుండి మంచిర్యాలకు ఒక ట్రిప్ బస్సుని పెంచుతామని హామీ ఇచ్చారన్నారు.

ఈకార్యక్రమంలో మందమర్రి యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, రామసాని సురేందర్, ఎం.డి తౌసిఫ్, బొజ్జ గణేష్, రేగుంట కిరణ్, మేరుగు సతీష్, సాయి కిరణ్ లు పాల్గొన్నారు.

## పుల్కల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,అన్నారు, గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా, ఆయన పుల్కల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు, ఈ మేరకు డిఎస్పి తో, కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు, అనంతరం స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డులను, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, కేసుల వివరాలను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలన్నారు, అలాగే ప్రతి దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు, కేటాయించిన విలేజ్ పై పూర్తి అవగాహన ఉండాలన్నారు, స్టేషన్ పరిధిలో గల కేడి, సస్పెక్ట్, రౌడీలను, తరచూ చెక్ చేస్తూ, ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు, అలాగే కెమెరాల ఏర్పాటు కృషి చేయాలి అన్నారు, లాంగ్ పెండింగ్ కేసులను, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు, రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు, వివిధ స్కూల్స్, కళాశాలలు, పని ప్రవేశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు, డయల్,100, కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు, అన్ని రకాల అప్లికేషన్లపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలన్నారు, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలన్నారు, డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా, ఎలాంటి సమస్య ఉన్న, నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు అన్నారు, అనంతరం పుల్కల్ మండల పరిధిలోని, (ఎన్ హెచ్ ),161, రోడ్డుపై అధిక ప్రమాదాలు జరుగుతున్న, ( బ్లాక్ స్పార్ట్,)ను, ఎస్పీ ప్రత్యేకంగా సందర్శించారు, ఈ తనిఖీల్లో ఎస్పీ వెంబడి, సంగారెడ్డి (డి.ఎస్.పి) సత్తయ్య గౌడ్, జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్సై విశ్వజన్ ఉన్నారు.....





## సింగూరు ప్రాజెక్టుకు పెరిగిన వరద

## అత్యవసరంగా లేపిన మరో మూడు గేట్లు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా బాగారెడ్డి, సింగూర్ ప్రాజెక్టు, ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల, 50, వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని, ఈ వరద నీటిని దిగువకు(19,9,2025) రోజు మధ్యాహ్నం 3, 00, గంటలకు ప్రాజెక్టు గేట్ నెంబర్(14,4,5,) గేట్లు 2,00, మీటర్లు ఎత్తి , గేట్ నెంబర్(3,8,9,%ద%10,) 1,50, మీటర్లవరకు అత్యవసరంగా ఎత్తి,60, నేల క్యూసెక్కుల వరకు దిగువకు వదలడం జరుగుతుందని, సింగూరు ప్రాజెక్టు నీటిపారుదల శాఖ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,బి, భీమ్, తెలియజేశారు, ప్రాజెక్టు దిగువ ప్రాంతాల వారు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలరని, బాజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు, మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువులు,గొర్ల, కాపరులు, మరింత అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లేవారు, నదిలోకి వెళ్ళరాదని ఆయన తెలియజేశారు, ప్రస్తుతం ప్రాజెక్టులోకి యావరేజ్ ఇన్ ఫ్లో 52139, క్యూసెక్కులు కాగా యావరేజ్ అవుట్ ఫ్లో 565997, క్యూసెక్కులు, జెన్కో,1858, క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కి,80, క్యూసెక్కులు, సింగూర్ లెఫ్ట్ కెనాల్ కు,120, క్యూసెక్కులు మిషన్ భగీరథకు,70, క్యూసెక్కులు,ఎవపోరేషన్ 390, క్యూసెక్కులు, కాగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29,917, టీఎంసీలు అయితే ప్రస్తుతం,17,215, టీఎంసీలుగా ఉందని, ప్రాజెక్ట్ అధికారులు తెలియజేశారు....

## పట్లూర్, జడ్.పి.హెచ్.ఎస్ మాథ్స్ టీచర్ పదవి విరమణ



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 19( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి/పట్లూరు జెడ్ పి హెచ్ ఎస్ పాతశాలలో మ్యాస్ బోదించిన ఉపాధ్యాయుడు దాడి రాజశేఖర్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం పట్లూరు జెడ్ పి హెచ్ ఎస్ లో విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తోటి సహచర ఉపాధ్యాయులు రాజశేఖరరెడ్డి ఉపాధ్యాయుడిగా విద్యార్థుల పట్ల బాధ్యతగాఅంకిత భావం తో, క్రమశిక్షణ తో తన కర్తవ్యన్ని నిర్వహించి మచ్చలేని మనిషిగా పేరు సంపాదించారు. అని కొనియాడారు. వారు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి అనేక విద్యార్థులను ఉన్నత స్థాయికి నడిపించిన వారికి దేవుడు మంచి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మిగతా శేష జీవితం ఆనందంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు ఈ కార్యక్రమం లో పాట శాల ప్రధానచార్యలు, మాజి సర్పంచ్ లు ఇందిర అశోక్, తుమ్మల సురేష్ , మాజి ఎంపీటీసీ మోరంగపల్లి సురేష్,లాలయ్య సార్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యపై స్పందన కోరిన జీఎంఆర్ టీం సభ్యులు







**నారాయణఖేడ్ న్యూస్ (ప్రజాబలం సెప్టెంబర్ 19)** నారాయణఖేడ్ పట్టణం 8వ వార్డ్ మనసునిపూర్,లో ప్రజలు తీవ్రమైన నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. బోరు ఉన్నప్పటికీ మోటార్ అమర్చకపోవడంతో నీరు అందక ఓకే బోర్ వద్ద జనాలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన (జీఎంర్,) టీం సభ్యులు, 8వ వార్డ్ (బి ఆర్ యస్ )పార్టీ నాయకులు తుకారం, కొండయ్య,నర్సింలు,యేసేపు,లక్ష్మయ్య,ప్రవీణ్,మొగులయ్య,సురేష్, తదితరులు చేరుకొని ప్రజల బాధలను అడిగి తెలుసు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బోరు మోటార్ అమర్చి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్య పరిష్కారం వరకు తమ వంతు కృషి కొనసాగిస్తామని ( జిఎంఆర్ ) టీం సభ్యులు హామీ ఇచ్చారు.....

## లాభాలను ప్రకటించి 35 శాతం వాటా అందజేయాలి

### జి.ఎం కార్యాలయం వద్ద ఎ.ఐ.టి.యూ.సి ధర్నా




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 19:**సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటాను కార్మికులకు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మందమర్రి ఏరియా జి. ఎం కార్యాలయం వద్ద ఎ.ఐ.టి.యూ.సి గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎ.ఐ.టి.యూ.సి సెంట్రల్ కమిటి సెక్రటరీ ఎం.డి అక్బర్, బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ లు మాట్లాడుతూ
యాజమాన్య మొండి వైఖరిపై మండి పడ్డారు. యాజమాన్యం తక్షణమే
వాస్తవ లాభాలు ప్రకటించి లాభాల్లో వాటా 35 శాతం ఇవ్వాలని స్ట్రక్చర్ మీటింగ్లో అవగాహనకు వచ్చినటువంటి సొంతింటి సహకారం అమలుకు, పెర్క్ పై ఇన్కంటాక్స్ యాజమాన్యమే చెల్లించాలని తదితర అంశాలపై సర్క్యులర్ రిలీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో లాభాల మాట ప్రకటించి 35% ఇవ్వాలని
లేనియెడల సమ్మెకు వెనకాడబొమనీ అన్నారు. అనంతరం
ఈ డిమాండ్లపై ఎస్ ఓ టు జి. ఎం విజయ ప్రసాద్ కి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శన్, తిరుపతి గౌడ్, ఏరియా నాయకులు ఇప్పకాయల లింగయ్య, సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస ,పెద్దపెల్లి బానయ్య, సి.వి రమణ, ఎగ్గేటి రాజేశ్వరరావు, ములకలపల్లి వెంకటేశ్వర్లు, గోపతి సత్యనారాయణ, రాజేష్ కుమార్ యాదవ్, సి వి రమణ, పిట్ కార్యదర్శిలు గాండ్ల సంపత్, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, సిహెచ్ పి శర్మ, కందకట్ల ఓదెలు, ప్రేమ్ లాల్, సట్ల కొండయ్య సివిక్ కార్మికులు పాల్గొన్నారు.




## మద్యం దుకాణాల రిజర్వేషన్ పెంచి గీత సొసైటీలకే కేటాయించాలి

హైదరాబాద్ సెప్టెంబర్ 19 గీత కార్మికుల హక్కుల కోసం బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, భువనగిరి మాజీ ఎంపీ డా.బూర నర్సయ్య గౌడ్ గళమెత్తరు.ఈ మ్వేరకు శుక్రవారం హైదరాబాద్లో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిసి, కల్లు గీత కార్మికులకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ 20 నెలలు గడిచినా కార్మికులు నిరీక్షణలోనే ఉన్నారని, హామీలు నెరవేర్చకపోవడం సమాజానికి అన్యాయ మని పేర్కొన్నారు. మద్యం దుకాణాల రిజర్వేషన్ పెంచి గీత సొసైటీలకే కేటాయించాలని,. కల్లు గీత వారికి రాష్ట్ర సొసైటీ వెంటనే ఏర్పాటు చేయాలని,. ఎక్స్గ్రేషియా బకాయిలను చెల్లించి, మొత్తాన్ని రు.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు.. అలాగే తాటి సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకువచ్చి జాతీయ సబ్సిడీలు కల్పించాలని,. ఎఅంఖీ ఆమోదించిన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తాటి హైబ్రిడ్ రకాలపై పరిశోధన చేపట్టాలని,.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు తెలిపారు.

# బతుకమ్మ కుంటలో బతుకమ్మ ఆడుదాం

## సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి రావాలని గాంధీ భవన్ వేదికగా కోరుతున్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు



సొంత చెల్లెలు ని బయటకు పంపిన చరిత్ర కేటీఆర్ ది

అలాంటి కేటీఆర్ అడబిడ్డల గురించి సుద్దపూస లాగ మాట్లాడుతుండు

బతుకమ్మ పై Brs పాట రాసినందుకు థాంక్స్

ఎదుకంటే మా పథకాలు ఎన్ని అమలు చేస్తున్నామో ప్రజలకు చెప్పారు

పాట రిలీజ్ చేసే ముందు ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలి

ఆడ బిడ్డలను గౌరవించని చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిది

బతుకమ్మ కుంటను ఆక్రమించింది మీరు కాదా?

మేము బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశాం

హైడ్రా మీద ఎడుస్తున్నారు

అదే హైడ్రా బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసింది

బతుకమ్మ కుంటలో బతుకమ్మ ఆడుదాం సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి రావాలని గాంధీ భవన్ వేదికగా కోరుతున్న

ఐదేండ్ల లో ఒక్క మహిళ మంత్రి లేని క్యాబినెట్ మీది

లక్షల కోట్ల కుంభకోణం చేసిన మీరు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే కేటీఆర్, కవిత కు అర్హత లేదు

దోసుకున్నారని కవిత స్వయంగా చెప్పింది

బతుకమ్మ పేరుతో కవిత వందల కోట్లు దోచుకుంది

మీరు దోచుకున్న సొమ్మును వసూల్ చేసే మొగుడు రేవంత్ రెడ్డి వచ్చిండు

ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజా పాలనను అమలు చేస్తున్నారు

ఆడ బిడ్డలకు 30రూపాయల చీర ఇవ్వలేదా?

సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి లు కాంగ్రెస్ గుర్తుమీద గెలిచి కాంగ్రెస్ గురించి మాట్లాడటం మంచి పద్ధతి కాదు

Brs కు చెంపపెట్టులాగా బతుకమ్మ పండుగ జరుపుతాం

మహిళలను గౌరవించడం నేర్చుకోండి

ఒళ్ళు దగ్గర బెట్టుకొని మాట్లాడకపోతే ఎన్నికల్లో మహిళలం డిపాజిట్లు రాకుండా చేస్తాం

# పండిట్ నెహ్రూ వల్లే అత్యున్నత విశ్వవిద్యాలయాలు, యూనివర్సిటీలు



నిజామాబాద్ బృందావన గార్డెన్స్ లో ట్రస్మా ఆధ్వర్యంలో టీచర్స్ డే సెలబ్రేషన్స్ అండ్ బెస్ట్ టీచర్ అవార్డ్స్2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యేలు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమి ఛైర్మెన్ తాహర్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ,తదితరులు

అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన టీపిసిసి చీఫ్

టీపిసిసి చీఫ్ పాయింట్స్

టీపిసిసి చీఫ్ పాయింట్స్

గురువుల పట్ల కృతజ్ఞత, గౌరవం తెలిపే మహోత్సవం గురుపూజోత్సవం

భారతీయ సంస్కృతిలో గురువుకు అతి పెద్ద స్థానం

తల్లిదండ్రులు జన్మినిస్తేగురువు జ్ఞానం ఇస్తాడు. అందుకే "మాతృ దేవో భవ, పితృ దేవో భవ, ఆచార్య దేవో భవ" అని ఉపనిషత్తులు బోధించాయి.

దేశ నిర్మాణంలో గురువులది ప్రథమ స్థానం

జ్ఞానం పంచే గురువు, తల్లిదండ్రుల తరువాత అత్యున్నత స్థానం కలిగినవారు

చరిత్రను పరిశీలిస్తే గురు–శిష్య పరంపర వల్లే మన దేశం విజ్ఞానం, ఆధ్యాత్మికం, సంస్కృతిలో ఉన్నత శిఖరాలకు చేరింది.

విద్య మాత్రమే కాదు, మంచి విలువలు, నీతి, క్రమశిక్షణ, మానవత్వం గురువు ద్వారా నేర్చుకుంటాం.

గురువు చూపే మార్గదర్శకత వలనే శిష్యుడు మంచి పౌరుడిగా, గొప్ప వ్యక్తిగా ఎదుగుతాడు.

చాణక్య వంటి గురువు వల్ల చంద్రగుప్తుడు మహారాజుగా నిలిచాడు. రాముడు, కృష్ణుడు గురువుల వద్ద విద్యాభ్యాసం చేశారు.

గురువు పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడం ప్రతి శిష్యుడి కర్తవ్యం.

గురువు చెప్పే మాటలు, మార్గదర్శకతను గౌరవిస్తేనే జీవితం సాఫల్యం చెందుతుంది.

గురువు కేవలం బోధించే వ్యక్తి కాదుబీ ఆయన శిష్యుని భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి, జ్ఞానం అనే దీపాన్ని వెలిగించే మహోన్నత వ్యక్తి.

గురువు జ్ఞానానికి మార్గదర్శి

విద్యార్థి జీవితాన్ని మలిచి, భవిష్యత్ కి దారి చూపే మహోన్నత వ్యక్తులు గురువులు

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అపారమని ప్రతి ఒక్కరూ గుర్తించాలి

ఆదునిక సాంకేతిక యుగంలోనూ గురువుల మార్గదర్శకత్వం శాశ్వతం

పండిట్ నెహ్రూ గారి వేసిన బీజం వల్లే అత్యున్నత విశ్వవిద్యాలయాలు, యూనివర్సిటీలు

దేశ నిర్మాణంలో ప్రవేట్ స్కూల్స్ ప్రముఖ పాత్ర

పదేళ్ల పాలనలో విజన్ లేక రాష్ట్రం అప్పుల పాలైంది

7 న్నర లక్షల కోట్ల అప్పుల ఊబిలో రాష్ట్రం కూరుకుపోయింది

టీచర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసు

విద్య వైద్యంపై ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు

జిల్లాకి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తీసుకురావడం పై నావంతు కృషి చేస్తా

హెల్త్ కార్డు గురించి పరిశీలించి ముఖ్యమంత్రితో చర్చిస్తా

చదువుకుంటేనే భవిష్యత్

సరదాగా మాట్లాడుతూ...ఈ రోజుల్లో టీచర్స్ పిల్లలను ముట్టుకునే పరిస్థితి లేదు

టీచర్స్ లేనిదే భవిష్యత్ లేదు

చదువుకోకుంటే జీవితం బ్లాక్ అండ్ వైట్ టీవీ..చదువుకుంటే జీవితం కలర్ టీవిలా ఉంటుంది

నైపుణ్యతను పెంపేందించేందుకు స్కిల్ యూనివర్సిటీలు తీసుకొస్తున్నాం

సిఎం ,మంత్రులను ఒప్పించి జిల్లాకి ఇంజనీరింగ్ కలశాల తీసుకొచ్చా

అగ్రికల్చర్ కలశాల త్వరలో జిల్లాకు రాబోతోంది

గతంలో నిజామాబాద్ జిల్లా వ్యవసాయం పారిశ్రామికతకు పెట్టింది పేరు.

జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేసి తీరుతానని సభా ముఖంగా తెలుపుతున్నా

విద్యా పరంగా జిల్లాకు రావాల్సిన అవకాశాలను తీసుకురావడానికి కృషి చేస్తా

దేశ వ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోంది

చెడు వ్యసనాలకు పిల్లలు త్వరగా ఎట్రాక్ట్ అవుతున్నారు తల్లి దండ్రులు జాగ్రత్తలు పాటించాలి

పిల్లలకు మెంటల్ స్ట్రెయిన్ తప్ప ఫిజికల్ స్ట్రెయిన్ లేదు

పిల్లలు క్రీడలపై దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని నా సలహా

# ముంపు బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తాం: మంత్రి , మేయర్

## షేక్ పేట డివిజన్ లోని విరాట్ నగర్, మిని బృందావనం , హకీమ్ కాలనీ ప్రజలకు మంత్రి, మేయర్ హామీ

## శాశ్వత పరిష్కారంకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీర్లకు హుకుం








**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్ 19, 2025:షేక్‌పేట్ డివిజన్ లోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద ముంపు బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాది, భూగర్భ గనుల శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.

శుక్రవారం సాయంత్రంషేక్‌పేట్ డివిజన్ విరాట్ నగర్, మిని బృందావనం , హకీమ్ కాలనీలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపుకు గురైన ప్రభావిత ప్రాంతాలనుమంత్రి , మేయర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాధిత ప్రజలతో మాట్లాడారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి, మేయర్ మాట్లాడుతూ.... ప్రజలు ధైర్యంగా ఉండాలని ముంపు బాధిత ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. శాశ్వత పరిష్కారం కోసం త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి, మేయర్ అధికారులకి ఆదేశించారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com